
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఉష్ణోగ్రత (అంచనా)

5-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	27
తెనాలి	39	27
నరసరావుపేట	39	28
బాపట్ల	37	27
రెంటచింతల	41	27
చీరాల	37	27

ముద్ర.. మోసం

రుణాల పేరుతో ఆన్‌లైన్‌లో టోకరా



ఆధార్ కార్డు, పాన్ కార్డు ఉంటే చాలు.. ఎటువంటి ష్యూరిటీ అవసరం లేదు.. రూ.5 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు ముద్ర రుణమిస్తాం.. కేవలం ఐదు నిమిషాల్లోనే ఖాతాలో నగదు జమ వుతుంది.. అంటూ ముద్ర రుణాల పేరుతో నయా మోసాలు వెలుగు చూస్తున్నాయి. ఇది సాదాసీదా పథకం కాదని.. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన ముద్ర రుణ పథకం అంటూ మోసగాళ్లు వల వేసి దోపిడీ చేస్తున్నారు. ఇది కాదంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రుణ పథకం ద్వారా కూడా రుణం మంజూరుచేస్తామంటూ ఆన్‌లైన్ వేదికగా మాయ చేస్తున్నారు. పైగా ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటోలు, రాజముద్రలతో ప్రకటనలు, లింకులతో వల వేస్తున్నారు. ప్రభుత్వ ప్రకటనల్లాగే ఉండటం, ప్రధాని, ముఖ్యమంత్రి ఫొటోలు, రాజముద్రలను చూసి పలువురు వారి మాయలో పడి మోసపోతున్నారు. సులభంగా రుణాలు వస్తున్నాయని నమ్మిన వ్యక్తుల ఆధార్, బ్యాంక్ ఖాతాల వివరాలు పెట్టించుకునే మోసగాళ్లు దర్జాగా దోచేస్తున్నారు.

- సీఎం రుణ పథకమని మాయ చేస్తూ దోపిడీ
- ష్యూరిటీ లేకుండా ఐదు నిమిషాల్లో మంజూరని వల
- ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఫొటోలతో ప్రకటనలు
- రూ.25 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు ఇస్తామంటూ ఎర

తెనాలి, మే 4 (ఆంధ్రజ్యోతి): తెనాలి మండలం కొలకలూరు, బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పెదపులివర్రు ప్రాంతాల్లో పలువురు రుణాల మాయలో పడి మోసపోయి రూ.లక్షల్లో పోగొట్టుకున్నారు. ఇలా బయటపడిన వారు కొందరే. బయటకు చెప్పుకోలేక కొందరు, అవమానంతో కొందరు.. ఉద్యోగుల వడంతో రచ్చ చేసుకోవడం ఎందుకులే అని సరిపెట్టుకుంటున్నారు. తెనాలి తహసీల్దారుకే ఈ తరహా బెదిరింపు కాల్ రావడం... పోలీసులకు ఫిర్యాదు చేసినా పోలీసుల నుంచి చర్యలు లేవు. సామాన్యులకి జరుగుతున్న మోసాలు, నష్టాల పరిస్థితి ఇక చెప్పనవసరంలేదు. ముద్ర రుణం అంటే కేంద్ర ప్రభుత్వం అందించే రుణ పథకం. కొన్ని ప్రైవేటు రుణ సంస్థలు అదే పేరుతో ఆన్‌లైన్‌లో మోసపు ప్రకటనలు ఇస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పథకం కావడం.. ప్రధాని ఫొటో, రాజముద్ర లోగో, ఆధార్, పాన్ కార్డు ఉంటే చాలని, ష్యూరిటీ అవసరం లేదన్న ప్రకటనలు చూసిన పలువురు వారి మాయలో పడుతున్నారు. బ్యాంకులకు వెళ్లకుండా, ఎటువంటి పత్రాలతో పనిలేకుండా రుణం వస్తుందన్న ఆశతో ఉన్న వారికి ఆ ప్రకటన కిందే ఉన్న లింక్‌ను క్లిక్ చేసి వివరాలు ఇస్తున్నారు. రుణం మంజూరైంది.. నగదు ఖాతాలో జమ కావాలంటే ప్రాసెసింగ్ చార్జీలు చెల్లించాలనే లింక్ వస్తుంది. రూ.500 నుంచి రూ.10 వేల వరకు చెల్లించాలని ఆ లింక్‌లో రావడం గమనార్హం. ఆ తర్వాత రుణానికి బీమా ప్రీమియం కింద రూ.12,500 చెల్లించాలని కొందరికి, రూ.35 వేలు చెల్లించాలని మరికొందరికి లింక్‌లో



కేంద్ర ప్రభుత్వ అధికారిక ప్రకటన

చూపుతున్నారు. రూ.10 లక్షల రుణానికి రూ.2,500 చెల్లించాలని, రూ.5 లక్షల రుణానికి రూ.9,435 చెల్లించాలని దరఖాస్తుదారులకు లింకులు వస్తున్నాయి. అయితే ముద్ర రుణం కోసం ఎటువంటి ప్రాసెసింగ్ ఫీజు వసూలు చేయకూడదనేది కేంద్రం సూచించిన నిబంధన కాగా అందుకు విరుద్ధంగా ఆన్‌లైన సంస్థలు వసూలు చేస్తున్నాయి. ముద్ర రుణ పరిమితి ప్రస్తుతం రూ.20 లక్షలే. అయితే బూటకపు రుణ సంస్థలు మాత్రం ఏకంగా రూ.75 లక్షల వరకు రుణాలు ఇచ్చేస్తామని ప్రకటనలు చేయడం గమనార్హం. ముద్ర రుణం అని ప్రకటిస్తూ దానిలో వ్యక్తిగత, వ్యాపార, ఆస్థి, కారు, గృహ, రైతు, తాకట్టు రుణాలు అంటూ ప్రకటన చేస్తున్నారు. పైగా మహిళలు, విద్యార్థులు, ఉగ్యోగులకు ప్రత్యేక రాయితీ అంటూ వల వేస్తున్నారు.

ముద్ర రుణంలో తరుణ్ కేటగిరీలో అత్యధికంగా రూ.10 లక్షల వరకే రుణం మంజూరవుతుంది. కానీ ఇక్కడ ఏకంగా రూ.60 లక్షలకు పైగా మంజూరైనట్లు మెసేజ్‌లు చేస్తున్నారు. పి.ఎం.ఎం.వై కింద అధికారికంగా రుణం మంజూరు చేసినట్లు చూపడం ఘరానా మోసానికి నిదర్శనం. వారు అడిగిన మొత్తాలన్నీ చెల్లించాక ఆన్‌లైన్‌లోనే రుణం మంజూరైనట్లు పేరు, అడ్రస్‌తో ఏకంగా ఒక మంజూరు ధ్రువీకరణపత్రమే వచ్చేస్తుంది.

సీఎం రుణం పథకం అంటూ కొత్తగా..

సీఎం రుణ పథకం అంటూ మరికొన్ని సంస్థలు ఆన్‌లైన్ వేదికగా ప్రకటనలు గుప్పిస్తున్నాయి. వీటిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటో, ప్రభుత్వ అధికారిక ముద్ర ఉండటం గమనార్హం. ఆధార్, పాన్ కార్డ్, బ్యాంక్ వివరాలు, ఫొటో ఉంటే ఐదు నిమిషాల్లో రూ. 2 లక్షల వరకు రుణం అంటూ ఆకర్షిస్తున్నారు. దీంతో దరఖాస్తు చేసుకున్న వారికి ఆ ఫీజు, ఈ ఫీజంటూ అందిన వరకు దోచేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్న రుణ పథకాల పేరుతో ఆన్‌లైన్ మోసగాళ్ల దోపిడీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలతో పోలీసులు సరిపెడుతున్నారు.

- వేసవి కార్యాచరణకు నిధుల లేమి
- రెండు నెలల క్రితం రూ.9.29 కోట్లతో ప్రతిపాదనలు
- నేటికి ఒక్కరూపాయి కూడా విడుదల చేయని ప్రభుత్వం



నరసరావుపేట మున్సిపాల్టీలో నీటి శుద్ధి ప్లాంట్

ఎక్కిళ్లు తప్పవా?

ఎండలు మండుతున్నాయి.. ఇప్పటికే భూగర్భజలాలు అడుగంటిపోయాయి.. తాగునీటి ఇబ్బందులతో మున్సిపల్ పట్టణాల్లోని అనేక కాలనీల్లో ప్రజలు అల్లాడుతున్నారు.. సాధారణంగా ఈ పాటికి మున్సిపాల్టీలు ట్యాంకర్ల ద్వారా ప్రత్యేకంగా నీటి సరఫరా చేస్తుండేవి. అయితే నిధులు లేమితో ప్రస్తుతం ఆ పరిస్థితి ఎక్కడా కానరావడంలేదు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని పలు మున్సిపాల్టీల్లో నీటి సరఫరా కష్టాలు మొదలయ్యాయి. రెండు నెలల క్రితమే నీటి ఎద్దడిని ఊహించిన పుర పాలకులు ప్రభుత్వానికి మున్సిపాల్టీల వారీగా ప్రతిపాదనలు పంపారు. అయితే ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా విడుదల కాకపోవడంతో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, తాగునీటి పథకాల మరమ్మతులను పురపాలకులు చేయలేకపోయారు. ఈ క్రమంలో తాగునీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వేసవిలో నీటి ఎద్దడిని అధిగమించేందుకు మున్సిపాల్టీలు కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేశాయి. అయితే ఆ కార్యాచరణ అమలుకు నిధులు లేమి ఆటం కంగా మారింది. రెండు నెలల క్రితమే నీటి ఎద్దడి నెలకొనే ప్రాంతాలను అధికారులు గుర్తించారు. ఆ ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.. కానీ ప్రభుత్వం నిధులు విడుదల కాకపోవడంతో పురపాలకులు అయోమయంలో ఉన్నారు. వేసవి ప్రణాళిక అమలు కోసం రెండు నెలల క్రితం రూ.9.29 కోట్లకు ప్రతిపాదలను పంపారు. దీనిపై ఇంతవరకు ప్రభుత్వం నుంచి స్పందన లేదు. దీంతో పల్నాడు జిల్లా పరిధిలోని వినుకొండ, చిలకలూరిపేట, మాచర్ల, గురజాల పట్టణాల్లో ప్రస్తుతం పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరగడంలేదు. సాధారణంగా ఆయా మున్సిపాల్టీలో ప్రతీ వేసవిలోనూ తీవ్ర నీటి ఎద్దడి నెలకొంటుంది. ఈ సమస్యను అధిగమించేందుకు పుర పాలకులు ముందస్తుగా సిద్ధమైనా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదు. ప్రస్తుతం వినుకొండ, చిలకలూరిపేట పట్టణాల్లో రెండు రోజు లకు ఒక సారి నీటిని సరఫరా చేస్తు న్నారు. మా చర్ల, గురజాల మున్సి పాల్టీల్లో రెండు రోజులకు ఒక పూట నీటిని సరఫరా చేస్తున్నారు. దాచేప ల్లి, పిడుగురాళ్ల, గుంటూరు కార్పొరేషన్, తెనాలి, పొన్నూరు, సత్తెనపల్లి మున్సిపాల్టీల్లో ఒక పూట నీటి సరఫరా జరుగుతుంది. మంగళగిరి, తాడేపల్లి, అద్దంకి, చీరాల, బాపట్ల రేపల్లె మున్సిపాల్టీల్లో రోజూ నీటి సరఫరా జరుగుతోంది.మూడు జిల్లాల్లో ఒక్క నరసరావుపేటలో మాత్రమే రోజూ రెండు పూటల పుష్కలంగా నీటిని సరఫరా చేస్తున్నారు.

ప్రతిపాదనలు ఇలా..

మున్సిపాల్టీ	నిధులు
పల్నాడు జిల్లా..	
నరసరావుపేట	రూ.1.62 కోట్లు
చిలకలూరిపేట	రూ.1.15 కోట్ల
వినుకొండ	రూ.70 లక్షలు
మాచర్ల	రూ.1.19 కోట్లు
గురజాల	రూ.30 లక్షలు
దాచేపల్లి	రూ.40 లక్షలు
పిడుగురాళ్ల	రూ.30 లక్షలు
సత్తెనపల్లి	రూ.15 లక్షలు
వినుకొండ	రూ.70 లక్షలు
గుంటూరు జిల్లా	
పొన్నూరు	రూ.44 లక్షలు
తెనాలి	రూ.52.50 లక్షలు
మంగళగిరి-తాడేపల్లి	రూ.80 లక్షలు
బాపట్ల జిల్లా..	
బాపట్ల	రూ.25 లక్షలు
అద్దంకి	రూ.21.50 లక్షలు
చీరాల	రూ.37 లక్షలు
రేపల్లె	రూ.88 లక్షలు

వేసవి ప్రణాళికలు ఇలా..

వేసవి నీటి ఎద్దడి ఎదుర్కొనేందుకు మున్సిపల్ అధికారులు రెండు నెలల క్రితమే సిద్ధమయ్యారు. ఇందుకు సంబంధించి మున్సిపాల్టీల వారీగా తాగునీటి పరిస్థితి.. సరఫ రా.. మరమ్మతులకు సంబంధించి ప్రణాళికలు రూపొందించారు. ఈ ప్రణాళికల అమలు చేసేందుకు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపారు. చిలకలూరిపేటలో రూ.1.15 కోట్లతో వేసవి ప్రణాళిక సిద్ధం చేసి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు రూ.30 లక్షలు అవసరమని ప్రభుత్వానికి తెలిపారు. ఇలా ప్రతీ మున్సిపాల్టీలో వేసవి కార్యాచరణను సిద్ధం చేశారు. రెండు నెలలుగా నిధుల విడుదల కోసం పురపాలకులు ఎదురు చూస్తున్నారు.



తెనాలి : కేంద్రీయ విద్యాలయం వద్ద పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

ప్రశాంతంగా.. నీట్

- 97 శాతం విద్యార్థులు హాజరు
- గుంటూరులో అత్యధికంగా 16 కేంద్రాల్లో పరీక్ష
- నరసరావుపేట, నాదెండ్ల, చీరాల, గుంటూరు తెనాలిలో కేంద్రాలు

గుంటూరు (విద్య), తెనాలి అర్బన్, నరసరావుపేట, నాదెండ్ల, చీరాల, మే 4 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలో ప్రవేశం కోసం జాతీయస్థాయిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆదివారం నిర్వహించిన నీట్(నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్) ప్రశాంతంగా జరిగింది. గుంటూరు నగరంలో 16 కేంద్రాలు, తెనాలిలో రెండు, పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం ఇర్లపాలెంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం, నరసరావుపేట సమీపంలోని కాకానిలోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రాల్లో పరీక్ష జరిగింది. మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్ష జరిగింది. విద్యార్థులు ఉదయం 11 గంటలకే కేంద్రాలకు చేరుకున్నారు. నీట్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. తొలుత హాల్‌టికెట్లు పరిశీలించి విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. ఆ తర్వాత బయోమెట్రిక్ సేకరించి, విద్యార్థుల ఫొటోలు తీసుకున్న తర్వాతే పరీక్ష హాల్‌లోకి పంపారు. ఆయా కేంద్రాల వద్ద ఎన్‌టీఏ నిర్దేశించిన డ్రెస్ కోడ్ పక్కాగా అమలు చేశారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆభరణాలు, వాచీలు ధరించకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. కేంద్రాల వద్ద గతంలో మాదిరిగా చెవిరింగులు, ఆభరణాలు తొలగించడం,ఫుల్ హ్యాండ్ షర్ట్‌లు కట్ చేయడం వంటి హడావుడి కనిపించలేదు.అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు అధికారులు ప్రకటించారు.



గుంటూరు : ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద హాల్ టికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

- గుంటూరులో 4250 మంది విద్యార్థులకు 4153 మంది(97.71 శాతం) హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను నీట్ కోఆర్డినేటర్, కేంద్రియ విద్యాల య ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ విజయ్‌కుమార్, డీఈవో రేణుక తదితరులు పరిశీలించారు.
- తెనాలిలోని కేంద్రియ విద్యాలయంలో 233 మంది విద్యార్థులకు 225 మంది, చెంచుపేటలోని కేఎస్ఎం హైస్కూల్‌లో 204 మందికి 197 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు తహసీల్దారు గోపాలకృష్ణ తెలిపారు.
- నరసరావుపేట మండలంలోని కాకాని వద్ద ఉన్న జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల, నాదెండ్ల మం డలం ఇర్లపాడులోని కేంద్రియ విద్యాలయంలో నీట్ జరిగింది.రెండు కేంద్రాల్లో పరీక్షకు 764 మంది విద్యార్థులకు 745 మంది హాజరయ్యారు. పరీక్షల సిటీ కో-ఆర్డినేటర్‌గా కేంద్రియ విద్యాల య ప్రిన్సిపాల్ నీరజ్‌కుమార్‌శ్రీవత్స, కో-ఆర్డినేటర్‌గా విజయకుమార్,పర్యవేక్షకుడుగా రొంపిచర్ల ఎంఈవోగా బ్రహ్మేశ్వరరావు వ్యవహరించారు. పరీక్షలకు ముందు ఇర్లపాడులోని కేంద్రం వద్ద ఆర్డీవో మధులత, తహసీల్దార్ రమణ విద్యాల యంలో వసతులను పరిశీలించారు. చిలకలూరి పేట రూరల్ సీఐ సుబ్బనాయుడు, ఎస్ఐ పుల్లారావుల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.
- చీరాలలో వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రా ల్లో జరిగిన పరీక్షకు 416 మందికి 12 మంది గైర్హాజరైనట్లు పరీక్షల సమన్వయకర్త, ఆర్డీవో చం ద్రశేఖర్‌నాయుడు తెలిపారు. ఆయా కేంద్రాలను కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడీ పరిశీలించారు. వారి వెంట నీట్ యూజీ నోడల్ అధికారి మృదుల, తహసీల్దార్ గోపీకృష్ణ, డీఎల్‌డీవో పద్మావతి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.మురళి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ స్నేహలత తదితర సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు-నడికుడి ట్రాక్‌కు.. రక్షణ

- 69 కిలోమీటర్ల పొడవునా ఫెన్సింగ్ ఏర్పాటు
- రైళ్ల స్పీడు 130 కిమీ పెంచేందుకు సన్నాహక చర్యలు

గుంటూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో పలుచోట్ల రైలు మార్గాల పైకి పశువులు, మనుషులు చొరబడుతున్నారు. దీంతో రైళ్లను గరిష్ఠ వేగంతో నడపలేని పరిస్థితి. ఈ క్రమంలో గుంటూరు-నడికుడి మార్గాన్ని రైల్వేశాఖ దుర్భేద్యంగా మార్చేందుకు సిద్ధమైంది. సెక్షన్ స్పీడుని 110 నుంచి 130 కిలోమీటర్లకు పెంచేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా రైలుమార్గానికి ఇరువైపులా యాంటీ క్రాష్ బ్యారియర్, ఆర్‌సీసీ ఇన్వర్టెడ్ టీ ప్యానల్ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నది. 23 కిలోమీటర్ల చొప్పున మూడు సెక్షన్లలో ఏడాది లోపు ఆయా పనులు చేపట్టేందుకు సిద్ధమైంది. గుంటూరు - పగిడిపల్లి సెక్షన్‌లో హఠాత్తుగా ట్రాక్‌పైకి వచ్చే పశువులను రైళ్లు ఢీ కొడుతున్నాయి. దాంతో ఈ మార్గంలో రైళ్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులతో పాటు వేగవంతగా నడపలేకపోతున్నారు. దీంతో రైళ్ల సమయపాలనపై ప్రభావం పడుతున్నది. జాతీయ రహదారులపై ఎన్‌హెచ్ఏఐ ఏర్పాటు చేస్తున్న యాంటీ క్రాష్ బ్యారియర్‌తో పశువుల చొర బాట్లకు అడ్డుకట్ట పడింది. దీంతో వాహనాలు గరిష్ఠ వేగంతో ప్రయాణించగలుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రైలుమార్గాలకు కూడా ఇదే మోడల్‌ని అనుసరించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ పరిస్థితుల్లో చొరబాట్లకు అవకాశం లేకుండా ఇరువైపులా ఫెన్సింగ్ వేయాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. అయితే ఇది ఖర్చుతో కూడుకున్న వ్యవహార మైనా ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఆయా పనులకు రైల్వేబోర్డు పచ్చజెండా ఊపింది. ఇందు కోసం రూ.29.89 కోట్లను రైల్వే శాఖ విడుదల చేసింది. దీంతో తొలి దశలో 69 కిలోమీటర్ల పొడవునా ఈ యాంటీ క్రాష్ బ్యారియర్, ఆర్‌సీసీ ఇన్వర్టెడ్ టీ ప్యానల్ ఫె న్సింగ్ నిర్మాణాలను చేపడుతున్నది. బిడ్డింగ్ ఈ నెల 8 నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు టెండర్‌ని ముగించి ఎవరైతే తక్కువ ధరకు బిడ్ దాఖలు చేస్తారో వారికే పనిని కేటాయించనుంది.



కొల్లిపరలో మొక్కజొన్నలకు పట్టాలు కప్పుతున్నరైతులు

అకాల నష్టం

- రైతులకు కన్నీటిని మిగిల్చిన వర్షాలు
- కల్లాల్లో పంటలను కాపాడుకునేందుకు అగచాట్లు
- బాపట్ల జిల్లాలో వడగళ్ల వాన.. పిడుగుపాటుకు ఇద్దరి మృతి

మంగళగిరి, బాపట్ల, కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె, మే 4 (ఆంధ్రజ్యోతి): ఉరుములు.. పిడుగులతో ఆదివారం పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. అకాల వర్షం రైతులకు తీవ్ర నష్టం మిగిల్చింది. వారం రోజులుగా ఎండ ఉక్కపోతకు ప్రజలు అల్లాడిపోగా ఆదివారం వాతావరణం చల్లబడటంతో ప్రజలు కొంత ఉపశమనం చెందారు. బాపట్ల జిల్లా పరిధిలో వడగళ్ల వాన వణికించింది. పిడుగుల కారణంగా ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. అకాల వర్షాల ధాటికి మామిడి, అరటి తోటలతో పాటు మొక్కజొన్న, మిర్చి తదితర పంటల రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈదురుగాలులకు వడగళ్లు తోడవడంతో మామిడికాయలు నేలరాలాయి. గాలి దుమారంతో అరటి తోటలు నేలకొరిగాయి. పర్చూరు ప్రాంతంలో మొక్కజొన్న, వైట్‌బర్లీ పొగాకు పంటలకు నష్టం వాటిల్లింది. కల్లాల్లో ఉన్న ధాన్యం, మిర్చి, మొక్కజొన్న తదితర దిగుబడులను కాపాడుకోవడానికి రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. దిగుబడులు తక్కువగా ఉండి నష్టాలు తప్పవనుకుంటున్న దశలో పడిన వర్షం తమ కష్టాలను రెట్టింపు చేశాయని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల దెబ్బకి ధాన్యం తడిసి రంగుమారడమో లేక తేమ శాతంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని రైతులు కన్నీటి పర్యంతమ వుతున్నారు. బాపట్ల, చీరాల ప్రాంతాలలో దాదాపు గంట పాటు ఉరు ములు బీభత్సం సృష్టించాయి. దీంతో ప్రజలు బయటకురావడానికే భయపడ్డారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో వర్షానికి ఈదురుగాలులు తోడై బీభత్సం సృష్టించాయి. రెండు మండలాల్లో భారీ వృక్షాలు, విద్యుత్ స్థంభాలు నేలకు ఒరిగాయి. వృక్షాలు రోడ్డుకు అడ్డంగా విరిగి పడటంతో ట్రాఫిక్‌కు పలు చోట్ల అంతరాయం ఏర్పడింది. భట్టిప్రోలు ప్రధాన రహదారిపై పడిన భారీ వృక్షాలను ఎస్ఐ శివయ్య తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. గాలులకు అరటి తోటలు విరిగి పడగా, మామిడి, సపోటా, జామ తోటలలో కాయలు నేల రాలాయి. ఉన్నట్లుండి మబ్బులు కమ్ముకొచ్చి కొల్లిపర మండల పరిధిలో చిరుజల్లులతో కూడిన వర్షం పడింది. కల్లాల్లో ఆరబట్టిన మొక్కజొన్న, జొన్న ఉత్పత్తులను కాపాడు కునేందుకు రైతులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. ఇటుక బట్టీలకు హడావిడిగా ప్లాస్టిక్ పట్టాలను కప్పుకున్నారు. తీరప్రాంతంలోని నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల పరిధిలో చిరుజ ల్లులతో కూడిన వర్షం పడింది. పెదకూరపాడు ప్రాంతంలో సు మారు గంటసేపు ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. దీంతో కల్లాల్లోని మిర్చి, పొగాకు ఉత్పత్తులు తడి చాయి. మంగ ళగిరిలో ఆదివారం ఉదయం గంటసేపు గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతోపాటు పెద్ద పెట్టున శబ్దం చేస్తూ పిడుగులు పడ్డాయి. ఈదురు గాలుల ధాటికి పలుచోట్లు హోర్డింగ్‌లు నేలకొరిగాయి.



ఉండవల్లిలో నేలకొరిగిన అరటి పంట

రెండు కుటుంబాల్లో విషాదం..

పిడుగులు రెండు కుటుంబాల్లో విషాదం నింపాయి. కృష్ణాజిల్లా మొవ్వ మండలం కోసూరు గ్రామానికి చెందిన వెల్డర్ మాతంగి సుప్రదీప్(25), వాగోలు అనీల్ కొల్లూరులో వెల్డింగ్ పని నిమిత్తం శ్రీకాకుళం-గాజుల్లంక మధ్య గాలు మార్గంలో వస్తుండగా పిడుగు పాటుకు గురయ్యారు. ద్విచక్ర వాహనం నడుపుతున్న సుప్రదీప్ అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక ఉన్న అనీల్ దూరంగా పడి గాయపడ్డాడు. కొల్లూరు వద్ద గొర్రెలు మేపుతున్న మహబూబ్‌నగర్ జిల్లా కోయలకొండ మండలానికి చెందిన అంజి వర్షం కురిసే సమయంలో పవర్‌బ్యాంకు నుంచి ఫోన్‌కు చార్జింగ్ పెట్టుకుని మాట్లాడుతుండగా పిడుగుపాటుకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. సమీపంలోని రైతులు గుర్తించి 108లో కొల్లూరుకి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం తెనాలికి ఆ తర్వాత గుంటూరులోని జీజీహెచ్‌కి తరలించారు. అంజి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. చినగంజాం మండల పరిధిలోని రొంపేరు కాల్వ సమీపంలోని పొలాల్లో గేదెలు మేపుతుండగా గడ్డం బ్రహ్మయ్య అనే వ్యక్తి పిడుగుపడి మరణించాడు.

రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారుడు మృతి

● ఒంగోలు సమీపంలో దుర్ఘటన

● కొప్పురావూరులో అలముకున్న విషాద ఛాయలు



మృతి చెందిన తల్లి కొడుకు పావని, కౌశిక్

పెదకాకాని, మే 4 (ఆంధ్రజ్యోతి): రెండు కుటుంబాలకు చెందిన బంధువులు రోడ్డు ప్రమాదానికి గురి కావటం...... అందులో ఒకే కుటుంబానికి చెందిన తల్లి, కొడుకు మృతి చెందటంతో పెదకాకాని మండలం కొప్పురావూరు గ్రామంలో విషాదఛాయలు అమ్ముకున్నాయి. కొప్పురావూరు గ్రామానికి చెందిన ఒక కుటుంబం..... పల్నాడు జిల్లా అమరావతికి చెందిన మరో కుటుంబంతో కలసి తిరుపతి వెళుతుండగా ఒంగోలు సమీపంలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో నలుగురు గాయపడ్డారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...... పెదకాకాని మండలం కొప్పురావూరు గ్రామానికి చెందిన తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు గుంటూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తుంటాడు. ఈయన కుటుంబం గుంటూరు పట్టణంలోని అమరావతి రోడ్‌లో నివాసం ఉంటున్నారు. వీరు తమ బంధువులైన పల్నాడు జిల్లా అమరావతికి చెందిన బూసి వినయ్ కుటుంబంతో కలసి తిరుపతిలో మొక్కు తీర్చుకునేందుకు ఆదివారం తెల్లవారుజామున కారులో ఆరుగురు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఒంగోలు సమీపంలోని కొప్పోలు ఫ్లైఓవర్ పై లారీ వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో తల్లి, కుమారుడు తిరుమల శెట్టి పావని(40), తిరుమల శెట్టి కౌశిక్(15) లు అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఉన్న మిగిలిన నలుగురిలో బూసి వినయ్, బూసి లావణ్య, తిరుమల శెట్టి వెంకటేశ్వరరావుల పరిస్థితి విషమంగా ఉంది. బూసి లోక్షిత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పావని, కౌశిక్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు ప్రభుత్వ తరలించారు. క్షతగాత్రులను తొలుత ఒంగోలు ఆసుపత్రికి అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రైవేట్ ఆస్పత్రి తరలించారు.

తల్లి పావని, కుమారుడు కౌశిక్‌లు మృతి చెందడంతో కొప్పురావూరు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కౌశిక్ ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాడు. 576 మార్కులు సాధించడంతో తిరుపతిలో మొక్కుబడి తీర్చుకునేందుకు బంధువులతో తల్లిదండ్రులు వెంటపెట్టుకొని బయలుదేరారు. మార్గమధ్యంలో ప్రమాదానికి గురై మృత్యువాత పడటంతో బంధువులంతా శోకసముద్రంలో మునిగిపోయారు.

ఇన్నర్ రింగురోడ్డు, పలకలూరురోడ్డు ఆర్‌వోబీల నిర్మాణాలకు సన్నాహాలు

● రూ. 106.65 కోట్లకు టెండర్లు పిలిచిన రైల్వే శాఖ ● రెండేళ్ల వ్యవధిలో బ్రిడ్జీల నిర్మాణానికి గడువు



ఇన్నర్ రింగురోడ్డులోని ఎల్‌సీ గేటు

గుంటూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): రెండు కీలకమైన రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు రైల్వే శాఖ రైల్ ఓవర్ బ్రిడ్జ్(ఆర్‌వోబీ)లను నిర్మించేందుకు సన్నాహాలు ప్రారంభించింది. గుంటూరు నగరంలోకి ప్రవేశించేందుకు, సిటీ నుంచి వెలుపలికి వెళ్లేందుకు అతి ముఖ్యమైన ఇన్నర్‌రింగురోడ్డు, పెదపలకలూరు రోడ్డులో ఉన్న ఎల్‌సీ గేట్లను తొలగించాలని నిర్ణయించింది. వాటి స్థానంలో ఆర్‌వోబీలను నిర్మించి వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చేసేందుకు చర్యలు చేపట్టింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో మంజూరైన ఈ రెండు ఆర్‌వోబీల నిర్మాణానికి ఏజెన్సీని ఎంపిక చేసేందుకు రైల్వే శాఖ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. గరిష్ఠంగా 24 నెలల వ్యవధిలో ఈ రెండు ఆర్‌వోబీల నిర్మాణం పూర్తి చేసేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకొన్నది.

గుంటూరు - నంబూరు రైల్వేస్టేషన్ల మధ్యన ఇన్నర్‌రింగు రోడ్డుపై ఉన్న లెవల్ క్రాసింగ్ గేటు నంబరు. 3 వలన ఇటీవలకాలంలో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమౌతున్నాయి. పదేళ్ల క్రితం ఇన్నర్ రింగురోడ్డు అందుబాటులోకి వచ్చినప్పుడు ట్రాఫిక్ అంతగా లేకపోవడంతో రైల్వే శాఖ ఏర్పాటు చేసిన ఎల్‌సీ గేటు వలన సమస్యలు ఉత్పన్నం కాలేదు. ఇప్పుడు ట్రాఫిక్ గణనీయంగా పెరిగిపోవడంతో ఈ మార్గంలో రైలు/గూడ్స్ రైలు వచ్చిన ప్రతీసారి ట్రాఫిక్ స్తంభించిపోతున్నది. కొన్ని సందర్భాల్లో ఐదు, పది నిమిషాల వ్యవధిలో రెండు, మూడు రైళ్లు వస్తుండటంతో సమస్య తీవ్రరూపం దాలుస్తున్నది. ఇక్కడ నాలుగు వరసల ఆర్‌వోబీ నిర్మించేందుకు గతంలో ఏపీసీఆర్‌డీఏ నిధులు సమకూర్చేందుకు ముందుకొచ్చింది. ఆ తర్వాత వెనక్కు తగ్గడంతో రైల్వే శాఖ దీనిని పక్కన పెట్టింది. ఇప్పుడు కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చొరవ తీసుకొని రైల్వే శాఖ ఆర్‌వోబీకి అయ్యే ఖర్చు అంతా భరించేలా ఒప్పించారు.

హైదరాబాద్, అనంతపురం వైపు నుంచి నగరంలోకి వచ్చే వాహనాలు ఎక్కువగా పేరేచర్ల జంక్షన్ నుంచి పెదపలకలూరు రోడ్డు మీదగా ప్రయాణిస్తాయి. అయితే ఇక్కడ నల్లపాడు - బండారుపల్లి రైల్వేస్టేషన్ల మధ్యన ఎల్‌సీ నంబరు. 6 గేటు ఉన్నది. దీంతో ఇక్కడ కూడా ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమౌతున్నాయి. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ 20 కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పుడే ఎల్‌సీ గేటుని మూసేస్తున్నారు. దీని వలన వాహనదారులు ఎక్కువ సమయం ఇక్కడ నిరీక్షించాల్సిన పరిస్థితి. ఇక సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఎక్కువ రైళ్లు ఈ మార్గంలో ప్రయాణిస్తుంటాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ రెండు వరసల ఆర్‌వోబీ నిర్మాణానికి డాక్టర్ పెమ్మసాని రైల్వే శాఖ అంగీకారం తెలిపేలా చేశారు. ఈ నేపథ్యంలో రెండు ఆర్‌వోబీలను ఒక ప్యాకేజ్‌లో చేర్చి గతిశక్తి ప్రాజెక్టు కింద నిర్మించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. టెండర్లు ఈ నెల 14వ తేదీన ప్రారంభమై 28వ తేదీతో ముగుస్తాయి. దాదాపుగా రూ. 106.65 కోట్ల నిర్మాణంతో ఈ రెండు ఆర్‌వోబీలను ఏకకాలంలో చేపడతారు. రెండేళ్ల వ్యవధిలో పూర్తి చేస్తారు.

నిర్మాణ సమయం... క్లిష్టమయం

నగరంలో శంకర్‌విలాస్ ఆర్‌వోబీ ఈ నెల 7వ తేదీ నుంచి నిర్మాణం ప్రారంభం కానుంది. దీంతోనే ట్రాఫిక్ సమస్యలు పెరిగిపోతాయి. ముఖ్యంగా కంకరగుంట ఆర్‌వోబీ, ఆర్‌యూబీ, డొంకరోడ్డులో వాహనాల రద్దీ తీవ్రమౌతుంది. ఈ పరిస్థితుల్లో నగరంలోకి ప్రవేశించే/వెలుపలికి వెళ్లే మార్గాలైన పలకలూరు, ఇన్నర్‌రింగురోడ్డులను కూడా ఆర్‌వోబీల నిర్మాణం కోసం మూసేస్తే ట్రాఫిక్ సమస్యలు తీవ్రరూపం దాలుస్తాయి. ఈ నేపథ్యంలో బ్రిడ్జీల సమయంలో ఎల్‌సీ గేట్లను మూసేయకుండా వాహనాలు రాకపోకలు సాగించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సి ఉన్నది. లేకుంటే కీలకమైన ఆ రెండు మార్గాలు మూసుకుపోతే రెండేళ్ల పాటు నగర ప్రజలు నరకం చూడాల్సిన పరిస్థితులు ఉత్పన్నమౌతాయి.



చుండూరులో ఆర్‌ఓబీల నిర్మాణం జరగనున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే ఆనందబాబు

రూ.251 కోట్లతో ఐదు ఆర్‌వోబీల నిర్మాణం

● బాపట్ల ఎంపీ కృష్ణ ప్రసాద్

చుండూరు (వేమూరు), మే 4 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల లోకసభ పరిధిలో రైల్వే శాఖ ద్వారా ఐదు రోడ్డు ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి రూ.251 కోట్లు నిధులు మంజూరు అయినట్లు బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుతో కలిసి వేమూరు నియోజకవర్గంలోని చుండూరు మండలంలో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన ఆర్‌వోబీల నిర్మాణం చేపట్టే ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం చుండూరు రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, బాపట్ల లోకసభ పరిధిలో నేషనల్ హైవేస్ విభాగం ద్వారా గుంటూరు నుంచి నిజాంపట్నం హార్బర్ వరకు కొత్తగా గ్రీన్ ఫీల్డ్ ఫోర్ లైన్ నిర్మాణానికి ఆమోదం లభించిందన్నారు. నేషనల్ హైవే 216లో ప్రస్తుతం టు లైన్స్ ఉన్నాయని దానిని ఫోర్ లైన్స్‌గా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం లభించిందన్నారు. ఇందుకు సర్వే కూడా ప్రారంభించినట్లు తెలిపారు. బాపట్ల-చీరాల మధ్య టూరిజం హబ్ ఏర్పాటుకు టూరిజం మంత్రి గజేంద్రసింగ్ శకావత్ రూ.97.52 కోట్ల నిధులను కేటాయించడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించిన పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. విజయవాడ నుంచి గూడూరు వెళ్లే రైల్వే లైన్‌లో మూడవ లైన్ పనులు 90 శాతం పూర్తయ్యాయని అయినప్పటికీ ప్రయాణ సౌకర్యం కోసం నాల్గవ లైన్ ఏర్పాటుకు తాము పంపిన ప్రతిపాదనకు కేంద్రం అంగీకారాన్ని తెలిపిందన్నారు. రేపల్లె-తెనాలి రైల్వే లైను డబుల్ లైన్ చేసేందుకు కూడా ఆమోదం లభించినట్లు పేర్కొన్నారు. తన ద్వారా రైల్వే శాఖకు 62 ప్రతిపాదనలను పంపడం జరిగిందన్నారు. వాటిలో బాపట్ల లోకసభ పరిధిలోనే వేమూరు అసెంబ్లీ ప్రాంతలోనే ఐదు చోట్ల రోడ్డు ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. అరెమండ-బోడపాడు ప్రాంతంలో ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుకు రూ.52.10 కోట్లు, గాయంవారిపాలెం-మోపర్రు మధ్య బ్రిడ్జి ఏర్పాటుకు రూ.50.66 కోట్లు, మోదుకూరు-ఆలపాడు మధ్య బ్రిడ్జి ఏర్పాటుకు రూ.52.24 కోట్లు, చుండూరు-ఆలపాడు మధ్య బ్రిడ్జి నిర్మాణానికి రూ.51.60 కోట్లు, వలివేరు-చినగాదెలవర్రు మధ్య బ్రిడ్జి నిర్మాణానికి రూ.54.77 కోట్లు నిధులు మంజూరయినట్లు వివరించారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ, ఐదు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు మంజూరు కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎంపీ ఆధ్వర్యంలో ఏడు నియోజకవర్గాలలో పలు భారీ ప్రాజెక్టులు ఏర్పాటుకు కృషి జరుగుతుందన్నారు. అనంతరం రైల్వే శాఖకు చెందిన నిర్మాణాలు చేపట్టే ప్రాంతాలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివారెడ్డి, యల్లారెడ్డి, రాఘవరెడ్డి, శంకర రెడ్డి, శరత్‌చంద్ర, అనిల్‌కుమార్, జనసేన నాయకులు పోకల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రూ.9 కోట్లతో ఉడాయించాడు

- పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదంటున్న బాధితులు

తెనాలిరూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): బంగారు నగల షాపుతో ఖాతాదారులకు దగ్గరై ఓ మ్యుచువల్లి ఎయిడెడ్ కో- ఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ పేరిట బ్యాంక్ స్థాపించి నమ్మకంగా ఖాతాలు తెరిపించి రూ.కోట్లతో బురిడి కొట్టిన ఉదంతం ఆదివారం గుంటూరు జిల్లా తెనాలిలో వెలుగు చూసింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం తెనాలి గంగానమ్మపేటలో గత 23 ఏళ్లుగా బంగారు దుకాణాన్ని నడుపుతూ ఖాతాదారులకు నమ్మకంగా యజమాని కొల్లూరు వెంకటేశ్వరరావు ఉండేవాడు. నగలు తయారు చేయడం, తాకట్టు పెట్టుకుని నగదు ఇవ్వడం వంటివి చేస్తూ మంచి పేరు తెచ్చుకున్నాడు. దీంతో తెనాలి, వేమూరు, చుండూరు వంటి పలు మండలాల ప్రజలు వెంకటేశ్వరరావు దుకాణానికి వచ్చి వెళ్ళేవారు. ఆ ఖాతాదారులతో తెనాలి, చావలిలో వెంకటేశ్వరరావు స్థాపించిన శ్రీ మణికంఠ మ్యూచువల్లీ కో-ఆపరేటీవ్ అండ్ త్రిఫ్ట్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ పేరుతో బ్యాంకులో అకౌంట్లు తెరిపించి వాటి ద్వారా డిపాజిట్లకు అధిక వడ్డీ ఇవ్వడంతోపాటు, బంగారం తాకట్టు, ఇతర లోన్లు ఇస్తామంటూ ప్రజలను నమ్మబలికారు. ఈ క్రమంలోనే చావలి ప్రాంతంలోని బ్రాంచ్‌లో దాదాపుగా రూ.9 కోట్ల మేర డిపాజిట్లు చేయించున్నాడు. గత కొన్ని రోజులుగా వెంకటేశ్వరరావుకు సంబంధించిన సొసైటీ బ్యాంకు తెరవకపోవడంతో ప్లేటు తిప్పేశాడని ప్రచారం ఊపందుకుంది. దీంతో తెనాలిలో వెంకటేశ్వరరావు ఇంటికి వచ్చి చూడగా కుటుంబంతోసహా ఊరు విడిచి వెళ్లిపోయాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని బాధితులు వాపోయారు. అతడి తమ్ముడిని ప్రశ్నించినా సరైన సమాధానం రాలేదని దీంతో ఇంటిముందే నిరసన చేసినట్లు వివరించారు. కాయకష్టం చేసుకుని వచ్చిన డబ్బులను నమ్మకంగా కట్టామని కొందరు తెలపగా, పంటభూమిని అమ్మగా వచ్చిన రూ.లక్షలు డిపాజిట్‌గా వేశామని మరి కొందరు, బంగారు నగలు తాకట్టుపెట్టి కొంతమేర నగదు తీసుకున్నామని అవి కట్టినా తమ నగలు ఇవ్వకపోవడంతో తాము నిండా మోసపోయామంటూ వాపోయారు. తమకు మంత్రి మనోహర్, ఎమ్మెల్యే ఆనందబాబు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.



కొల్లూరు వెంకటేశ్వరరావుఇంటి ముందు నిరసన తెలుపుతున్న బాధితులు

లేడీస్ హాస్టల్‌లో సీసీ కెమెరాల కలకలం

అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

గుంటూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అరండల్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రాడీపేట 4/13 లో గల ఒక లేడీస్ హాస్టల్‌లో సీసీ కెమెరాల కలకలం రేపింది. హాస్టల్లోని వాష్‌రూమ్స్ కవర్ అయ్యే విధంగా సీసీ కెమెరా ఏర్పాటు చేసి తమ పట్ల ఇబ్బందికరంగా ప్రవర్తిస్తున్నాడు అంటూ ఓ విద్యార్థిని వాపోయారు. అంతేగాక హాస్టల్ నిర్వాహకుడు తన పట్ల లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని, అదేమని ప్రశ్నిస్తే ఆయనతో పాటు, భార్య తమ పట్ల అనుచితంగా ప్రవర్తించి, దూషించారని ఓ విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం అరండల్ పేట పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే వెస్ట్ డీఎస్పీ అరవింద్, అరండల్ పేట సీఐ ఆరోగ్య రాజు హాస్టల్ విద్యార్థినులను విచారించారు. సీఐ ఆరోగ్యరాజు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బ్రాడీపేట 4/13 లో ఉన్న ఒక ఉమెన్స్ హాస్టల్‌ను నెల రోజుల క్రితం ప్రకాశం జిల్లా సిఎస్ పురం మండలానికి చెందిన గుర్రం ప్రసాద్, శారద దంపతులు అద్దె తీసుకొని నిర్వహిస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఈ హాస్టల్ కొనసాగుతుండగా తాజాగా ప్రసాద్ దంపతులు లీజుకు తీసుకున్నారు. ప్రసాద్ గతంలో బెంగుళూరులో ఇలాగే హాస్టల్ నిర్వహించారు. అయితే అక్కడ నష్టం రావడంతో ఆయన గుంటూరుకు వచ్చి లేడీస్ హాస్టల్ నిర్వహిస్తున్నారు. అయితే హాస్టల్లో ఉంటున్న విద్యార్థినీలలో ఓ విద్యార్థిని గత నెలలో చెల్లించాల్సిన హాస్టల్ ఫీజు చెల్లించలేదు. నిర్వాహకుడు ఫీజు అడగ్గా ఇంటికి వెళ్లి వచ్చిన తర్వాత కడతానని చెప్పింది. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల ప్రాంతానికి చెందిన బాధితురాలు మూడు రోజుల క్రితం ఇంటికి వెళ్ళింది. ఇంటికి వెళ్లే సమయంలో హాస్టల్ నిర్వాహకుడు ప్రసాద్ ఆమెను బస్టాండ్ వద్ద దించుతానని తన ద్విచక్ర వాహనం ఎక్కాలంటూ ఒత్తిడి చేశాడు. దీంతో ఆమెను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని బస్టాండుకు తీసుకువెళ్ళాడు. అక్కడ వాహనం దిగిన తర్వాత బస్సు ఎక్కేందుకు వెళ్తుండగా నిర్వాహకుడు ప్రసాద్ ఆమెను టిఫిన్ చేద్దాం రమ్మంటూ ఒత్తిడి చేయగా ఆమె నిరాకరించింది. తర్వాత ఆమె బస్సులో ఎక్కిన తర్వాత కూడా ఆమెకు ప్రసాద్ అనేకసార్లు ఫోన్ చేయడం, ఆమె వాట్సాప్‌కు హాయ్ అంటూ మెసేజ్‌లు పెట్టాడు. ఇదిలా ఉంటే గతంలో హాస్టల్‌కి సంబంధించి మెయిన్ గేటు వద్ద, మెట్ల వద్ద సిసి కెమెరాలు ఉండేవి. అయితే ఇటీవల హాస్టల్ నిర్వాహకుడు ప్రసాద్ ఓ సి సి కెమెరాను కారిడార్‌లో ఏర్పాటు చేసి దానిని వాష్‌రూమ్స్ కవర్ అయ్యే విధంగా అటువైపు తిప్పాడని బాధిత విద్యార్థినులు వాపోయారు. వాష్‌రూమ్స్ వైపు సీసీ కెమెరాలు ఎలా పెడతారని వాటిని తొలగించాలంటూ తాము కోరితే ఉంటే ఉండండి లేకపోతే వెళ్ళిపోండి అంటూ కసురుకున్నారని విద్యార్థినులు తెలిపారు. బాధితురాలు ఫిర్యాదుతో అరండల్ పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. హాస్టల్ నిర్వాహకులైన గుర్రం ప్రసాద్ ఆయన సతీమణి శారదలను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు వెస్ట్ డిఎస్పీ అరవింద స్పష్టం చేశారు. కాగా, గత నెలలో ఓ విద్యార్థిని హాస్టల్ ఫీజు చెల్లించలేదు. డబ్బులు ఇవ్వాలని అడిగినందుకు ఆమె మాపై తప్పుడు ఫిర్యాదు చేసిందని హాస్టల్ నిర్వాహకులు ప్రసాద్, శారద దంపతులు వాపోయారు. ఆమె ఇదే హాస్టల్లో సుమారు మూడు సంవత్సరాలుగా ఉంటుందని, తాము హాస్టల్ ఫీజు అడగడంతో బజరంగ్ దళ్ మాజీ నాయకుడి ఒత్తిడి మేరకు ఫిర్యాదు చేశారన్నారు. కారిడార్‌లో సీసీ కెమెరా ఏర్పాటు చేశామే గాని వాష్‌రూమ్స్ కవర్ చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేయలేదన్నారు. విద్యార్థినులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో వెంటనే సీసీ కెమెరాను వేరే వైపు తిప్పడం జరిగిందన్నారు. హాస్టల్లో విద్యార్థులను విచారించినా వాస్తవం తెలుస్తుందన్నారు.

జూన్ ఒకటి కల్లా పూడికతీత పూర్తి చేయాలి

- మునిసిపాల్టీలను ఆదేశించిన ప్రభుత్వం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నరసరావుపేట, మే 4 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు కార్పోరేషన్‌తో సహా అన్ని పురపాలక సంఘాల్లో వరద, మురుగు కాలువల్లో పూడితతీత 1 కల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం మునిసిపాల్టీలను ఆదేశించింది. వరద పనులపై అలసత్వం శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలువడి వార్తపై ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు డీఎంఏ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కాలువల్లో పూడిక తీత పనులపై ఆయన సమీక్షించారు. తక్షణమే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. వర్షాలు కురిసే సమయం కల్లా కాలువల్లో పూడిక ఉండటానికి వీలు లేదని పేర్కోన్నారు. పనులు నిర్వహణలో అలసత్వం తగదన్నారు. పనులు చేపట్టడంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ నేపథ్యంలో మునిసిపాల్టీల్లో ప్రధాన వరద.. మురుగు కాలువల్లో పూడికతీతకు అధికారులు సమయాత్తమవుతున్నారు. పనులకు సంబంధించి వ్యయం అంచనాలను రూపొందిస్తున్నారు. పనులకు టెండర్లు నిర్వహించేందుకు కమీషనర్లు చర్యలు చేపట్టారు.

ఎనిమిది ప్రత్యేక రైళ్లకు కరెంట్ బుకింగ్స్ సదుపాయం

గుంటూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ మీదగా రాకపోకలు సాగిస్తున్న ఎనిమిది ప్రత్యేక రైళ్లకు పలు స్టేషన్లలో కరెంటు బుకింగ్ సదుపాయాన్ని రైల్వే శాఖ కల్పించింది. నంబరు. 01049 ముంబై సీఎస్‌టీ - ఖుర్దారోడ్, నంబరు. 07838 సాయినగర్ షిర్డి - తిరుపతి, నంబరు. 07166 కటక్ - హైదరాబాద్, నంబరు. 072026 శ్రీకాకుళం రోడ్డు - చర్లపల్లి స్పెషల్ ట్రైన్స్‌కు గుంటూరులో కరెంటు బుకింగ్ సదుపాయాన్ని కల్పించారు. దీని వలన ప్రయాణీకులు ఆయా రైళ్ల గుంటూరులో బయలుదేరడానికి అరగంట ముందు వరకు కూడా ఖాళీగా మిగిలిపోయిన టిక్కెట్లను బుకింగ్ చేసుకోవచ్చు. అలానే నంబరు. 02811 భువనేశ్వర్ - యశ్వంత్ పూర్ రైలుకు గుంటూరు, మార్కాపురం రోడ్డు, గిద్దలూరు, నంబరు 02812 యశ్వంత్‌పూర్ - భువనేశ్వర్ రైలుకు గిద్దలూరు, మార్కాపురం రోడ్డు, నరసరావుపేట, గుంటూరు, నంబరు. 07202 అరసికెరె - నరసపూర్ రైలుకు అనంతపురం, నంద్యాల, గిద్దలూరు, మార్కాపురం రోడ్డు, నంబరు. 02864 యశ్వంత్‌పూర్ - సంత్రగచి రైలుకు గిద్దలూరు, మార్కాపురం రోడ్డు రైల్వేస్టేషన్లలో కరెంటు బుకింగ్‌ని కల్పించినట్లు జడ్‌ఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు ఉప్పులూరి శశిధర్‌చౌదరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆంధ్రుల వైభవానికి చిహ్నం ఒంగోలుజాతి ఎద్దులు

- తెనాలి శ్రావణ్‌కుమార్

పొన్నూరు టౌన్, మే, 4 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రుల వైభవానికి చిహ్నంగా ఒంగోలు జాతి ఎద్దులు నిలుస్తున్నాయని జిల్లా టీడీపీ అధ్యక్షుడు, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. చేబ్రోలు మండలంలోని వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ధూళిపాళ్ల వీరయ్యచౌదరి మెమోరియల్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఒంగోలుజాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలను ఆదివారం ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, నజీర్‌అహ్మద్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ధూళిపాళ్ల వీరయ్యచౌదరి జిల్లాలో పాడిపరిశ్రమ అభివృద్ధికి బాటలు వేశారన్నారు. ఆయన అడుగుజాడల్లో పయనిస్తున్న ఆయన తనయుడు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ జాతీయస్థాయి ఎడ్ల పోటీలు నిర్వహించడం ద్వారా ఒంగోలు జాతి ఎద్దుల పరిరక్షణకు పాటుపడుతున్నారన్నారు. రాజకీయాల్లో తనదైన ప్రత్యేక ముద్ర వేసిన నరేంద్రకుమార్ పాడిపరిశ్రమ అభివృద్ధికి, ఒంగోలు జాతి ఎడ్ల పరిరక్షణకు పాటుపడుతున్నారన్నారు. సంగం డెయిరీ ద్వారా పశుపోషకులను ప్రోత్సహించడమే కాకుండా డీవీసీ వైద్యశాలను నిర్మించి ప్రజలకు, రైతులకు కార్పొరేట్ వైద్యాన్ని అందజేస్తున్నారని కొనియాడారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్‌అహ్మద్ మాట్లాడుతూ ఒంగోలుజాతి కనుమరుగైపోతుందన్నారు. ప్రపంచంలోనే ప్రత్యేక సంతతిగా నిలుస్తున్న ఒంగోలు జాతి ఎద్దుల పరిరక్షణ ఇలాంటి పోటీల ద్వారా సాధ్యమవుతుందని తెలిపారు. ఈ పోటీల్లో నాలుగవ రోజు ఆరుపళ్ల విభాగంలో రాష్ట్ర నలుమూలల నుంచి విచ్చేసిన పలు ఎడ్ల జతలు పోటీపడ్డాయి. పోటీలను వీక్షించేందుకు రైతులు ప్రముఖులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు.



ఆరుపళ్ల విభాగంలో బండ లాగుతున్న ఎద్దులు

శ్రీమహంకాళీ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి నారా లోకేశ్

దుగ్గిరాల, మే 4 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల మండలం కేఆర్‌కొండూరులోని శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ఠను పురస్కరించుకుని మంత్రి నారా లోకేశ్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ముఖ్యఅతిథిగా నారా లోకేశ్‌ను ఆహ్వానించారు. దేవదాయశాఖ కమిషనర్ రామ చంద్రమోహన్, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస రావు, ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎస్ఎస్ చంద్రశేఖర్, ఈవో సునీల్, వ్యవస్థాపక ధర్మకర్త రంగ ప్రసాద్, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, పద్మశాలీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్లమెంటు టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, ఎంపీపీ షేక్ జబీన్, కేసంనేని శ్రీఅనిత తదితరులు ఘనస్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపిన అనంతరం లోకేశ్‌కు అర్చకులు ఆశీర్వచనం పలికి అమ్మవారి ఫొటోను బహూకరించారు.



గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

గోబెల్స్ సంఘానికి జాతీయ అధ్యక్షుడు జగన్

● టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి


కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): గోబెల్స్ సంఘానికి జాతీయ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డయితే రాష్ట్ర అధ్యక్షుడు అంబటి రాంబాబని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జగన్‌రెడ్డి సహా వైసీపీ నాయకులంతా అన్నం తినడానికి, అబద్దాలు ఆడటానికి మాత్రమే నోరు తెరుస్తారని మండిపడ్డారు. భవిష్యత్‌లో సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నా, పెద్దఎత్తున ప్రాజెక్టులు చేపట్టి వేగంగా, నాణ్యతగా పూర్తి చేయాలన్నా చంద్రబాబుకి తప్ప మరెవరికీ సాధ్యం కాదని ప్రధాని మోదీ చెప్పిన విషయం వైసీపీ నాయకులకు మింగుడు పడడం లేదన్నారు. ఐదేళ్ల అధికారంలో ఉన్న వైసీపీ ఒక్క రోజైన ప్రత్యేక హోదా, విభజన సమస్యలపై పార్లమెంటులో ఎందుకు మాట్లాడలేదో అబద్దాల అంబటి ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. క్విడ్ ప్రోకో, మద్యం కుంభకోణం తదితర కేసుల్లో జగన్ శాశ్వతంగా జైల్లో మగ్గిపోక తప్పదని హెచ్చరించారు. ఎన్నికలకు ముందు విశాఖపట్నంలో ప్రమాణస్వీకారం చేస్తాం అని మాట్లాడిన వైసీపీకి అమరావతి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. జగన్‌కి దమ్ము, ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి తన సత్తా ఏపాటిదో నిరూపించుకోవాలన్నారు. జగన్ సహా ఆయన క్యాబినెట్లోని మాజీ మంత్రులంతా త్వరలో వారు చేసిన నేరాలకి జైలుపాలు కాక తప్పదని కనపర్తి హెచ్చరించారు

కార్గో పార్సిల్‌కు పడిగాపులు

● కౌంటర్లు పెంచాలన్నా పట్టించుకోని అధికారులు



కౌంటర్‌లో నిరీక్షిస్తున్న వినియోగదారులు

గుంటూరు, మే 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సరుకు రవాణా సంస్థ కార్గో పార్సిల్ డిపాజిట్‌లకు వెళితే వినియోగదారులు పడిగాపులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పార్సిల్‌కు ఇచ్చేందుకు కౌంటర్ ఒకే ఒక్కటి ఉండటంతో వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ఆర్టీసీ సంస్థ కార్గో పార్సిల్ సంస్థ ద్వారా నిత్యం పెద్ద ఎత్తున ఎగుమతి, దిగుమతులు అవుతుంటాయి. 2016 నుంచి ఆర్టీసీ కార్గో పార్సిల్ సంస్థకు శ్రీకారం చుట్టింది. వస్తువులు ఎక్కడి నుంచి ఎక్కడికైనా 24 గంటల్లో చేరేలా ప్రణాళికలు రూపొందించింది. గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో కార్గో పార్సిల్ రవాణా సంస్థకు నిత్యం ప్రజల నుంచి ఆదరణ పెరుగుతోంది. ఇక్కడ నుంచి నిత్యం జిల్లాలోని పట్టణ ప్రాంతాలతో పాటు ప్రధానంగా హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, అనంతపూర్ ప్రాంతాలకు పెద్ద ఎత్తున సరుకు రవాణా జరుగుతుంది. గత ఏడాది రూ.12.21 కోట్ల ఆదాయంతో రాష్ట్రంలోనే మూడో స్థానంలో ఉమ్మడి గుంటూరు జిల్లా కార్గో నిలిచినట్లు అధికారులు తెలిపారు. వినియోగదారుల ఆదరణ రోజురోజుకు పెరుగుతున్నా ఆ స్థాయిలో కౌంటర్లు పెంచటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కేంద్ర సహాయ మంత్రి చెప్పినా బేఖాతరు..

ఇటీవల కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఎన్‌టీఆర్ బస్టాండ్‌లోని కార్గో పార్సిల్ కార్యాలయాన్ని తనిఖీలు చేశారు. ఆ సమయంలో వినియోగదారులు క్యూలో నిరీక్షించడాన్ని గమనించిన పెమ్మసాని రద్దీ సమయంలో మరో కౌంటర్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అప్పుడు అంగీకరించిన అధికారులు ఆ తర్వాత అమలు చేయడాన్ని విస్మరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రద్దీ సమయాల్లోనైనా అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

భగీరథ మహర్షి కృషి మరువలేనిది

● కలెక్టరేట్‌లో నివాళులర్పించిన కలెక్టర్ నాగలక్ష్మి



భగీరథ మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

గుంటూరు (తూర్పు), మే 4(ఆంధ్రజ్యోతి): ప్రజల శ్రేయస్సుకు గంగను భూమి పైకి తీసుకువచ్చిన భగీరథుడి కృషి, దృఢనిశ్చయం మరువలేనిదని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి కొనియాడారు. కలెక్టరేట్, డీఆర్సీ సమావేశం మందిరంలో ఆదివారం జరిగిన భగీరథ మహర్షి జయంతి ఉత్సవాల్లో ఆమె పాల్గొని చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భగీరథ మహర్షి జయంతిని రాష్ట్ర ఉత్సవంగా జరుపుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో జేసీ భార్గవతేజ్, నాయీ బ్రాహ్మణ, గౌడ వెల్ఫేర్ల డైరెక్టర్లు మద్దిరాల గంగాధర్, శైలజ, బీసీ సంక్షేమ శాఖ డీడీ మయూరి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చెప్పిన గ్రహణం వైసీపీనే

● జగన్ మెప్పుకోసం పాకులాడుతున్న అంబటి
● గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ధ్వజం


ప్రజల వినతులు వింటున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): అమరావతి పునః నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ చెప్పిన గ్రహణం వైసీపీనే అని, అది ఇంకా ఆంధ్రా ప్రజలను వదలలేదని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. పశ్చిమ కార్యాలయంలో ఆదివారం ఆమె ప్రజలు, పార్టీ నేతల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోదీ అభయంతో అమరావతికి ఇక తిరుగు లేదన్నారు. అమరావతి పునఃప్రారంభ సభని చూసి వైసీపీ నేతల వెన్నుల్లో వణుకుపుట్టి ఇష్టానుసారం మాట్లాడుతున్నారన్నారు. సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే అంబటి రాంబాబుకు ఇన్‌చార్జి పదవి నుంచి తొలగించిన నాటి నుంచి భయం పట్టుకుందన్నారు. వైసీపీలో తన మనుగడ కోసం, జగన్మోహన్‌రెడ్డి మెప్పు కోసం అంబటి పాకులాడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ వచ్చే ప్రాంతాల్లో అలజడి సృష్టించాలన్న లక్ష్యంతో పైపులు తగలబెట్టారన్నారు. శిలాఫలకాలు ధ్వంసం వెనుక కుట్ర దాగి ఉందని, దీనికి బాధ్యులైన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందన్నారు.

విభిన్న ప్రతిభావంతులను ఆదుకోవడం అభినందనీయం

● వీల్‌చైర్స్ పంపిణీలో నగర మేయర్ కోవెలమూడి


వీల్ చైర్స్ పంపిణీ చేస్తున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, మే 4 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులను ఆదుకోవడం అభినందనీయమని నగర మేయర్ రవీంద్ర తెలిపారు. ఆదివారం రోటరీ క్లబ్ అఫ్ గుంటూరు సెంటన్నియల్ ఆధ్వర్యంలో వీల్ చైర్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సమాజంలో విభిన్న ప్రతిభావంతులను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, సరిపూడి అనిల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీభారతి మహోత్సవాలు


శ్రీశివానంద భారతి స్వామికి అక్షరాంజలి జ్ఞాపికను అందజేస్తున్న శ్రీగంభీరానంద భారతి స్వామీజీ

గుంటూరు(తూర్పు), మే 4(ఆంధ్రజ్యోతి): శ్రీమహా కామేశ్వరి ధర్మ పరిపాలన సంఘం ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేటలో కొలువైన శ్రీశృంగేరి శ్రీవిరుపాక్ష శ్రీపీఠంలో శ్రీభారతి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిత్య పూజలు నిర్వహించారు. అనంతరం జగద్గురు గంభీరానందభారతి స్వామి వారిచే శృంగేరి విరూపాక్ష పీఠమునకు శ్రీపర శివానంద భారతి స్వామి వారికి ఉత్తర పీఠాధిపతిగా పట్టాభిషేక మహోత్సవం నిర్వహించారు. గంభీరానంద భారతి మహా స్వాములు అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో ఆడిటర్లు జి శివరామకృష్ణ ప్రసాద్, పరమహంస, హైకోర్టు న్యాయవాది కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేవుడిచ్చిన వరం సమాజ సేవ

● పేద ముస్లిం పిల్లలకు ఉచితంగా ఖత్నాలో ఎమ్మెల్యే నసీర్



మందులు, ఆహారం అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మే 4(ఆంధ్రజ్యోతి): సమాజసేవ అనేది దేవుడిచ్చిన వరమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరులోని అంజుమన్-ఏ-ఇస్లామియా స్కూల్లో ముస్లిం యూత్ ఆధ్వర్యంలో ఆదివారం పేద ముస్లిం పిల్లలకు ఉచితంగా ఖత్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 350 మంది చిన్నారులకు ఖత్నా నిర్వహించి వారికి అవసరమైన మందులు ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆరిఫ్, రౌఫ్, సలీం, రెహమాన్, షౌకత్, జిలాని, ముస్లిం యూత్ అసోసియేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్ల నిర్వహణలో భాగంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ రాజమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. సంపత్‌నగర్, ఆర్ అగ్రహారం, ఎత్తురోడ్డు, మస్తాన్ దర్గా రోడ్డు, రమే ష్ హాస్పటల్, మార్కెట్ ఏరియా, పట్నంబజారు ప్రాంతాల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగం ట వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేస్తామన్నారు.

దర్శకరత్నగా దాసరి చిరస్మరణీయుడు

గుంటూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): దర్శకరత్నగా, తెలుగు సినీ దర్శకుడిగా, నటుడిగా, కేంద్ర మంత్రిగా వ్యవహరించిన దాసరి నారాయణరావు తెలుగు ప్రజలకు చిరస్మరణీయుడని తెలగ అభ్యుదయ సంఘం నాయకుడు బాలిశెట్టి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. దాసరి జయంతి సందర్భంగా కాపు హాస్టల్‌లో దాసరి చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. బాలిశెట్టి మాట్లాడుతూ దాసరి నారాయణరావు 150 చిత్రాలకు పైగా దర్శకత్వం వహించటంతో పాటు 55 సినిమాలను నిర్మించారని తెలిపారు. 16 నంది అవార్డులు, ప్రతిష్టాత్మక రఘుపతి వెంకయ్య అవార్డును కూడా అందుకున్నారన్నారు. తెలుగురాష్ట్రాల్లో కాపు సంఘాన్ని ఏకతాటి పైకి తెచ్చేందుకు ఎంతో కృషి చేశారన్నారు.

మధుమేహంపై అవగాహన కలిగివుండాలి

గుంటూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మధుమేహం, బీపీ వంటి వ్యాధులపై అవగాహనతో జాగ్రత్తలు పాటించాలని ప్రముఖ డయాబెటాలజిస్టు డాక్టర్ వీవీ రామ్‌కుమార్ తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆరోగ్య సభలో ఆయన ప్రసంగించారు. ఆరోగ్యకరమైనజీవన శైలితో మధుమేహం అదుపులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, టీవీ సాయిరామ్, బసవగుప్తా, చంద్రశేఖర రావు తదితరులున్నారు.

ఆకట్టుకున్న నృత్యప్రదర్శన


పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు

గుంటూరు(తూర్పు), మే 4(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై రాధామాధవ కల్చరల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో 319వ నెలనెలా వెన్నెల సందర్భంగా ఆదివారం జరిగిన నృత్యప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలుత పారిశ్రామికవేత్త మిట్టపల్లి రమేష్‌బాబు తదితరులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పలు నాట్యగురువులు బెళ్ళగుబ్బల అనీతారావ్, బి.శారద, చింత వెంకట శివరామకృష్ణకుమార్, టి. సాయిమాధవి, చింతల భ్రమరాంబిక, అనంతుల విజయకుమారిలను నాట్యసారధి అవార్డుతో వారి శిష్యులకు నాట్యరంజని అవార్డుతో ఘనంగా సత్కరించారు.

ఫిర్యాదులు వస్తే సహించేది లేదు

● రౌడీషీటర్లకు పట్టాభిపురం సీఐ కౌన్సెలింగ్


రౌడీషీటర్‌లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు

గుంటూరు, మే 4(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదులు వస్తే సహించేది లేదని పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు రౌడీషీటర్లను హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ల కదిలికలపై నిఘా ఉంచామన్నారు. సత్ప్రవర్తన కలిగిన రౌడీషీటర్‌లపై షీట్లు తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా సివిల్ వివాదాల్లో తలదూర్చినా, పంచాయితీలు చేసినా కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఆదివారం పోలీస్ స్టేషన్‌కు హాజరు కావాలన్నారు అదేవిధంగా రౌడీషీటర్ల జీవన విధానం, వారి రోజువారీ కార్యకలాపాలపై సమగ్ర వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యం స్వాధీనం

గుంటూరు, మే 4(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని నగరంపాలెం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రేషన్‌బియ్యాన్ని గోతాలు మార్చి అక్రమంగా నిల్వచేసి తరలించడానికి సిద్ధంగా ఉన్న బియ్యం తెల్ల సంచులను స్వాధీనం చేసుకున్నారు. నగరంపాలెం స్టేషన్ పరిధిలోని మల్లారెడ్డి నగర్ ఇస్కాన్ టెంపుల్ ఎదురు నరేష్ అనే రేషన్ డీలర్ సుమారు సంవత్సరం నుండి ఓ షెడ్ అద్దెకి తీసుకొని రేషన్ దందాను కొనసాగిస్తున్నాడు. ఈ మేరకు పోలీసులు సుమారు 160 పైగా బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశ్రాంత ఉద్యోగులకు ఆర్జితసేవల నగదు చెల్లించాలి

గుంటూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్పించిన ఆర్జిత సేవలకు బదులు నగదుపొందే సౌకర్యం అందక విశ్రాంత ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్జిత సెలవు ఖాతాలో నిల్వఉన్న సెలవులు కొన్ని షరతులకు లోబడి అప్పగించి దానికి ప్రతిఫలంగా నగదు రూపంలో పొందేందుకు ప్రభుత్వం జీవో నెం.238 ఉత్తర్వుల ద్వారా సౌకర్యం కల్పించిందన్నారు. ఈ సౌకర్యం గెజిటెడ్, నాన్ గెజిటెడ్, నాల్గవ తరగతి ఉద్యోగులకు కూడా వర్తిస్తుందన్నారు. పదవీ విరమణ సందర్భంలో ఉద్యోగి ఖాతాలో నిల్వఉన్న ఆర్జిత సెలవును నగదు పొందే అవకాశం ఉన్నా రెండు సంవత్సరాల నుండి ప్రభుత్వం చెల్లింపులు చేయటంలేదని, ఆర్జిత సెలవు సరెండర్ చేసేందుకు ఉద్యోగులను వర్గాల వారీగా విభజించి ఏఏ వర్గాల ఉద్యోగులు ఏఏ నెలల్లో ఆర్జిత సెలవు సరెండర్ చేయవచ్చునో ప్రభుత్వం సమయ సూచీని నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేస్తుందన్నారు. దానికి అనుగుణంగా ఉద్యోగుల ఆర్జిత సెలవును సరెండర్ చేస్తూ నగదు సౌకర్యం పొందవచ్చన్నారు. ఈ సౌకర్యం కోసం ఉద్యోగులను మూడు వర్గాలుగా విభజించారని, నాల్గవ తరగతి ఉద్యోగులు, నాన్ గెజిటెడ్ ఉద్యోగులు, గెజిటెడ్ ఉద్యోగులు కానీ ఏ సందర్భంలోనైనా ప్రభుత్వం నిర్ణయించిన సమయ సూచిక కంటే ముందే పదవీ విరమణ చేసే ఉద్యోగులకు సమయ సూచికతో నిర్దేశించిన మూడు నెలల్లోనే ఆర్జిత సెలవు సరెండర్ చేసి నగదు చేసుకొనేందుకు అనుమతించవచ్చన్నారు. ఒక ఉద్యోగి జూన్ 30వ తేదీ నాటికి ఆర్జిత సెలవు 225 నుండి 245 రోజుల మధ్య నిల్వ ఉన్నట్టయితే అటువంటి వారికి కూడా సమయ సూచికకు ముందు ఆర్జిత సెలవు మంజూరు చేయవచ్చన్నారు. ఆర్జిత సెలవు జమ గరిష్ఠ పరిమితి 300 రోజులుగా నిర్ణయించి తదుపరి జీవో నెం.232 ద్వారా ఉత్తర్వులు చేయటం ద్వారా 225నుంచి 245 రోజులకు అనే విషయంలో వివరణ రావాల్సి ఉందన్నారు. ఒక సంవత్సరం సర్వీసు పూర్తి చేయాల్సిన రెగ్యులర్ ఉద్యోగులు ప్రతి ఆర్థిక సంవత్సరంలో 15 రోజులు రెండు, మూడు సంవత్సరాల సర్వీసు పూర్తిచేసిన రెగ్యులర్ ఉద్యోగులు రెండు ఆర్థిక సంవత్సరాల బ్లాక్ పీరియడ్‌లో 30 రోజులు ఆర్జిత సెలవును సరెండర్ చేసుకొనేందుకు అనుమతి ఇస్తారన్నారు. ప్రభుత్వం స్పందించి పదవీ విరమణ చేసిన ఉద్యోగుల ఖాతాలో నిల్వ ఉన్న ఆర్జిత సెలవులకు బదులు నగదు పొందే అవకాశాన్ని ఉపయోగించుకొనే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్థికశాఖ కార్యదర్శికి రాసిన ఒక లేఖలో ఈదర వీరయ్య కోరారు.

ముగిసిన ఆహ్వాన నాటికల పోటీలు


అసత్యం నాటికలో సన్నివేశం

తెనాలి అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరు లో నిర్వహిస్తున్న ఆహ్వాన నాటికల పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. కొలంకపూరి నాటక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో చివరి రోజు మూడు నాటికలు ప్రదర్శించారు. విశాఖపట్నం చైతన్య కళా స్రవంతి కళాకారులు ప్రదర్శించిన అసత్యం నాటికను బాలాజీ నాయక్ దర్శకత్వం వహించారు. కంటికి కనిపించేది అంతా సత్యం కాదు కనిపించనిదంతా అసత్యం కాదు అబద్ధమైనా ఒక మంచికి దోహదపడితే సత్యమంటూ సందేశం అందించిం ది. శ్రీకాకుళం లలితశ్రీ కళాసమితి కళాకారులు ప్రదర్శించిన మతమా మానవత్వమా నాటికను సూర్యప్రకాశరావు రచించగా రామలింగస్వామి దర్శకత్వం వహించారు. మతం మత్తులో సమాజం చీలిపోతూ కక్షలు, కర్పణ్యాలతో నిండిపోతున్న తరుణంలో మానవత్వమే మనిషి మనుగడకు శాశ్వతమని కళాకారులు చాటిచెప్పారు. కొలకలూరు సాయి ఆర్ట్స్ కళాకారులు ప్రత్యేక ప్రదర్శనను మాధవ్ రచించగా గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. గోపరాజు బాలత్రిపురసుందరమ్మ జీవిత సాఫల్య పురస్కారాన్ని రంగస్థల, టీవీ నటి సురభి ప్రభావతికి, శిల్పి మదన్‌మోహన్ సాఫల్య పురస్కారాన్ని రంగస్థల రూపశిల్పి పచ్చల శేషగిరికి ప్రదానం చేశారు. పరిషత్ సభ్యులు పర్యవేక్షించారు.

కౌలు రైతుల పరిస్థితి దయనీయం



మాట్లాడుతున్న పి.జగన్నాథం, పాల్గొన్న కొల్లి రంగారెడ్డి

గుంటూరు(తూర్పు), మే 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.వి జగన్నాథం తెలిపారు. స్థానిక కొత్తపేట, కౌలురైతు సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నుంచి కౌలు రైతులకు ఎటువంటి సహాయ సహకారాలు లేవన్నారు. గుర్తింపు కార్డులు, ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలకు పరిహారం అందడం లేదన్నారు. జిల్లాలో కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని 6న సీపీఐ కార్యాలయంలో జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో కౌలు రైతులు, నాయకులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో కంజుల విఠల్ రెడ్డి, కొల్లి రంగారెడ్డి పాల్గొన్నారు.

భావదేవుని బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

పొన్నూరు టౌన్, మే, 4 (ఆంధ్రజ్యోతి): శ్రీసుందరవల్లీ రాజ్యలక్ష్మీసమేత సాక్షిభావన్నారాయణ స్వామి బ్రహ్మోత్సవాలకు ఆదివారం అంకురార్పణ జరిగింది. స్వామివారి కల్యాణ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలకు శ్రీకారం చుట్టిన సందర్భంగా గరుడ పతాకానికి పూజ లు నిర్వహించి ఆకాశదీపం వెలిగించి పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన నాగస్వర కచేరి భక్తులను ఆకట్టుకుంది.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరం

● వారం పాటు ఏకనామం కార్యక్రమం
● 13న స్వామి వారి కల్యాణ మహోత్సవం

పెదనందిపాడు, మే 4(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన మండలపరిధిలోని నాగులపాడు శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలకు కమిటీ నిర్వాహకులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ దేవస్థానం 11 దశాబ్దాలుగా ఆధ్యాత్మికతకు నిలయంగా మారింది. రాష్ట్ర నలుమూలల నుంచి ఈ దేవస్థానానికి వారంలో రెండు పర్యాయాలు భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటూ ఉంటారు. ఆలయంలో స్వామికి నిత్యపూజలు జరుగుతూనే ఉంటాయి. ఈ ప్రాంతంలో నివసించే వారు తమ పిల్లలకు స్వామి పేరులోని నాగరాజు, నాగవల్లీ, నాగేశ్వరరావు అనే పేర్లతో నామకరణం చేస్తుంటారు. మే 6నుంచి 13వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. దీనిలో భాగంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. దేవస్థానంలో 49 శిరస్సులు గల పంచలోహ విగ్రహంపై పాలరాతి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి భక్తులకు దర్శనమిస్తుంటారు. దూర ప్రాంతాల నుంచి ఒక రోజు ముందుగానే ఇక్కడకు చేరుకుని పుట్టపోగులు పేరుతో పిల్లలకు చెవులు కుట్టించడం తలనీలాలు అర్పించి మొక్కుబడులు తీర్చుకుంటారు. వివాహం, సంతానం లేని వారు వార్లు పోసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తే అనుకున్న కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం.

ఘనంగా లాఫింగ్ డే వేడుకలు


లాఫింగ్ డే వేడుకల్లో పాల్గొన్న ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ తదితరులు

గుంటూరు(తూర్పు), మే 4(ఆంధ్రజ్యోతి): వరల్డ్ లాఫింగ్ డేను ఆదివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు లాల్‌వజీర్ మాట్లాడుతూ మనసారా నవ్వితే ఆరోగ్యానికి మేలు చేకూరుతుందన్నారు. అనంతరం కంటిలో నీటి కాసులుపై డాక్టర్ దివ్య దీప్తి ఆధ్వర్యంలో ఉచిత పరీక్షలు, అవగాహన సదస్సు నిర్వహించారు.

8న భోగరాజు పట్టాభిసీతారామయ్య విగ్రహావిష్కరణ

గుంటూరు(తూర్పు), మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక హిందూ కళాశాల, యూనియన్ బ్యాంకు ఎదురుగా ఏర్పాటు చేసిన స్వాతంత్ర సమరయోధులు, ఆంధ్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య విగ్రహావిష్కరణ 8న జరుగుతుందని ఆంధ్ర బ్యాంక్ విశ్రాంత ఎంప్లాయీస్ అసోసియేషన్ రిసెప్షన్ కమిటీ చైర్మన్ కే హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం, రెవెన్యూ కల్యాణ మండపంలో సభ జరుగుతుందన్నారు.

రాష్ట్ర స్థాయి బీచ్ గేమ్స్ ఎంపికలు

గుంటూరు(తూర్పు), మే 4 (ఆంధ్రజ్యోతి): క్రీడల సాంకేతిక నిర్వహణ కమిటీ, ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో భాగంగా ఈ నెల 19 నుంచి 25 వరకు డామన్, డయ్యూలో జరిగే రాష్ట్ర స్థాయి బీచ్ పోటీలకు రాష్ట్ర స్థాయి ఎంపికలు జరుగుతున్నాయని డీఎస్‌డీవో నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో భాగంగా 6న ఎన్టీఆర్ జిల్లాలో పురుషుల విభాగంలో బీచ్ కబడీ, మహిళల విభాగాల్లో బీచ్ వాలీబాల్, ఫుట్‌బాల్, కర్నూలు జిల్లాలో సెపక్ తక్రా(మహిళలు, పురుషులు) విభాగాల్లో పోటీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల్గిన క్రీడాకారులు ఆయా జిల్లాల క్రీడాభివృద్ధి అధికారిని సంప్రదించాలని సూచించారు.

మెకానిక్‌ల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలి

గుంటూరు(తూర్పు), మే 4(ఆంధ్రజ్యోతి): టూ వీలర్స్ మెకానిక్‌ల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలని నవ్యాంధ్ర టూవీలర్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సుభాని కోరారు. అరండల్‌పేటలో ఆదివారం జరిగిన అసోసియేషన్ రాష్ట్రస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు పిలుపు మేరకు బుడమేరు వరదల్లో తమ అసోసియేషన్ అనేక సేవలనందించామని గుర్తుచేశారు. గుర్తింపు కార్డు ఉన్న మెకానిక్‌ల వాహనాలకు చలానాలు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆటోరంగానికి కార్పోరేషన్ ఏర్పాటు చేస్తామని కొంత మంది ప్రచారం చేస్తున్నారని దీనిని మెకానిక్‌లు నమ్మొద్దని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు, ఉల్లి సాంబశివరావు, పర్వతనేని శివ, భవానిశంకర్, నాగరాజు, శ్రీనివాసరావు, అన్వర్ బాషా, భవాని, సయ్యద్ అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

దిక్సూచి

సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ దేశ వ్యాప్తంగా ఉన్న 30 సీపెట్ కేంద్రాల్లో అడ్మిషన్ టెస్ట్ ద్వారా డిప్లొమా, పీజీ డిప్లొమా, పోస్ట్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ఆంధ్రప్రదేశ్ విజయవాడ కేంద్రంలో 150, తెలంగాణ హైదరాబాద్ కేంద్రంలో 300 సీట్లు ఉన్నాయి. అర్హులైన స్త్రీ, పురుష అభ్యర్థులు 2025 మే 29 తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

సీపెట్ అడ్మిషన్ టెస్ట్ 2025

కోర్సులు

డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ: మూడు సంవత్సరాల వ్యవధి కోర్సు ఇది. మొత్తం ఆరు సెమిస్టర్లు ఉంటాయి. పదో తరగతి పాసైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ: మూడు సంవత్సరాల వ్యవధి కోర్సు ఇది. మొత్తం ఆరు సెమిస్టర్లు ఉంటాయి. పదో తరగతి పాసైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్: రెండు సంవత్సరాల వ్యవధి కోర్సు ఇది. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. సైన్స్‌తో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ డిజైన్ విత్ క్యాడ్/క్యామ్: ఒక సంవత్సరం ఆరు నెలల వ్యవధి కోర్సు ఇది. మూడు సెమిస్టర్లు ఉంటాయి. మెకానికల్/ప్లాస్టిక్స్/పాలిమర్/టూల్/ ప్రొడక్షన్/మెకట్రానిక్స్/ఆటోమొబైల్/టూల్ అండ్ డై మేకింగ్/ పెట్రోకెమికల్స్/ ఇండస్ట్రియల్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ టెక్నాలజీ లేదా డీపీఎమ్‌టీ/డీపీటీ(సీపెట్) డిప్లొమా చేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.
(హైదరాబాద్ క్యాంపస్‌లో నాలుగు కోర్సులు ఉండగా, విజయవాడ క్యాంపస్‌లో మాత్రం క్యాడ్/కామ్ కోర్సు లేదు)

వయస్సు: ఈ కోర్సులకు ఎలాంటి గరిష్ట వయోపరిమితి లేదు.
ఎంపిక విధానం: ప్రవేశ పరీక్ష ఆధారంగా
దరఖాస్తు రుసుము: 100/-
చివరి తేదీ: 2025 మే 29
ఎంట్రెన్స్ తేదీ: జూన్ 8
కోర్సు ప్రారంభం: 2025 జూలై 14
వెబ్‌సైట్: www.cipet.gov.in

డీఎస్సీ ప్రిపరేషన్ ఇలా



ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం జరిగే ముఖ్యమైన పరీక్ష డీఎస్సీ(డిస్ట్రిక్ సెలెక్షన్ కమిటీ). నిర్ణీతమైన పద్ధతిలో అధ్యయనం చేస్తే ఇందులో విజయం సాధించడం పెద్ద కష్టం ఏమీ కాదు.

సిలబస్ అర్థం చేసుకోవాలి: మొదట అభ్యర్థి తను ఎంచుకున్న పోస్టుకు సంబంధించిన సిలబస్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలి. ఉదాహరణకు ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, టీజీటీ, పీజీటీ, భాషా పండిట్స్ వంటి పోస్టుల సిలబస్‌ను పూర్తిగా చూసుకోవాలి. తరువాత సబ్జెక్టు వారీగా ముఖ్యమైన టాపిక్స్‌ను గుర్తించాలి.

టైమ్ టేబుల్ తయారు చేసుకోవాలి: ఏ రోజు, ఏ సమయంలో ఏ సబ్జెక్టు చదవాలో ఒక ప్రణాళిక తయారు చేసుకోవాలి. సబ్జెక్టుల వారీగా ప్రాముఖ్యత కలిగిన టాపిక్స్ గుర్తించాలి. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, ప్రాస్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, ఎడ్యుకేషన్ సైకాలజీ, సబ్జెక్టుకు సంబంధించిన కంటెంట్ మెథడాలజీ ఇలా వీటికి నిర్ణీత సమయం కేటాయించాలి.

స్టడీ మెటీరియల్, బుక్స్: ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఆంధ్రప్రదేశ్ ఎస్సీఈఆర్‌టీ పుస్తకాలు తీసుకోవాలి. అలాగే సిలబస్‌కు అనుగుణంగా తెలుగు అకాడమీ పుస్తకాలు కూడా సిద్ధం చేసుకోవాలి.

నమూనా పరీక్షలు, గత ప్రశ్నపత్రాలు: గత ప్రశ్నపత్రాలను తీసి, ప్రశ్నలు ఎక్కువగా ఏయే టాపిక్స్ నుంచి వస్తున్నాయో ఒక అంచనాకు రావాలి. అలాగే నమూనా పరీక్షలు రాయడం వల్ల, లోటు పాట్లపై ఒక అవగాహన వస్తుంది. ఎక్కడ వెనకబడుతున్నామో అర్థం చేసుకుని ఆయా టాపిక్స్‌పై మరింత దృష్టిపెట్టాలి. అలాగే సమయ పాలన కూడా చాలా ముఖ్యమైన అంశం.

సొంత నోట్స్: ప్రతీ సబ్జెక్టులోని, ప్రతీ చాప్టర్‌కి సొంతంగా నోట్స్ తయారు చేసుకోవాలి. ఇందులో కూడా ముఖ్యమైన పాయింట్లను అండర్‌లైన్ చేసుకోవాలి. పరీక్ష ముందు ఒకసారి తొందరగా చూసుకోవడానికి ఉపయోగపడతాయి.

మనోధైర్యం, క్రమశిక్షణ: అదృష్టవశాత్తు అని కాకుండా, నేను తప్పకుండా సాధించగలను అని మొదట అభ్యర్థి నమ్మాలి. ఆ తర్వాత ప్రిపరేషన్ ప్రారంభించాలి. అది కూడా క్రమం తప్పకుండా ఉండాలి. టైమ్‌టేబుల్ ఎప్పుడైనా గాడి తప్పినట్లు అనిపిస్తే సరిచేసుకోవాలి. ఒక్కోరోజు దీనిని పాటించడానికి కుదరకపోతే ఒకటి రెండు రోజుల్లోపు ఆ సిలబస్‌ను కవర్ చేయాలి. పరీక్షలకు సమయం కొద్దిగానే ఉన్నందున సమగ్ర ప్రిపరేషన్ అవసరం. దీనితోపాటు సరైన నిద్ర, ఆహారం, ఆరోగ్యం ముఖ్యం. దీనిని కూడా సరిగ్గా పట్టించుకోవాలి.

అధికారిక సమాచారం: సిలబస్ మొదలుకుని పరీక్షకు సంబంధించిన ఏ సమాచారం కావాలన్నా అధికారిక వెబ్‌సైట్‌ను చూడడం ఉత్తమం.

పరీక్ష షెడ్యూల్

- **దరఖాస్తుల దాఖలు చివరి తేదీ:** 2025 మే 15
- **హాల్‌టికెట్ల డౌన్‌లోడ్:** 2025 మే 30
- **పరీక్ష తేదీలు:** జూన్ 6 నుంచి జూలై 7వ వరకు
- **ప్రాథమిక కీ:** పరీక్షలు పూర్తయిన రెండో రోజు

ఎంపిక విధానం

- **ఎస్ఏ, ఎల్పీ:** రాత పరీక్ష 80 శాతం, టెట్ వెయిటేజీ 20 శాతం
- **పీఈటీ:** రాత పరీక్ష 50 శాతం, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ 30 శాతం, టెట్ 20 శాతం
- **మ్యూజిక్ టీచర్లు:** రాత పరీక్ష, స్కిల్ టెస్ట్
- **క్రాఫ్ట్, ఆర్ట్, డ్రాయింగ్:** రాత పరీక్ష
- **ఎస్జీటీ:** ఇంతకు ముందు టెట్ అర్హత సాధించిన అందరూ టెట్ కమ్ టీఆర్టీ రాయాలి. గతంలో టెట్ రాసినవారికి ఏ పరీక్షలో ఎక్కువ మార్కులు వస్తే వాటినే పరిగణనలోకి తీసుకుంటారు. గతంలో టెట్ రాయనివారు ఈ పరీక్షలో ఓసీ 60 శాతం, బీసీ 50 శాతం, ఎస్సీ/ఎస్టీ/పీహెచ్ వారు 40 శాతం అర్హత సాధించాలి.

సిలబస్‌లో ప్రధాన అంశాలు

- జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్
- విద్యలో దృక్కోణాలు(పర్స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్)
- ఎడ్యుకేషన్ సైకాలజీ
- కంటెంట్, మెథాలజీ

ప్రతీ పోస్టుకు ప్రత్యేక సిలబస్

- ఎస్జీటీ(సెకెండరీ గ్రేడ్ టీచర్)
- స్కూల్ అసిస్టెంట్
- టీజీటీ(ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్)
- పీజీటీ(పోస్ట్‌గ్రాడ్యుయేట్ టీచర్)

ఎస్జీటీ సిలబస్

- జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్(08 మార్కులు)
- విద్యా దృక్పథాలు (04 మార్కులు)
- విద్య మనోవిజ్ఞాన శాస్త్రం (08 మార్కులు)
- కంటెంట్, మెథడాలజీ (60 మార్కులు)
- మొత్తంగా 80 మార్కులకు పరీక్ష ఉంటుంది.

పార్ట్-1
జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్(08 మార్కులు)
పార్ట్-2
విద్యా దృక్పథాలు(04 మార్కులు)
పార్ట్-3
విద్య మనో విజ్ఞాన శాస్త్రం(08 మార్కులు)
పార్ట్-4
జనరల్ తెలుగు కంటెంట్(08 మార్కులు)
తెలుగు బోధన పద్ధతులు(04 మార్కులు)
పార్ట్-5
ఇంగ్లిష్ కంటెంట్(08 మార్కులు)
ఇంగ్లిష్ మెథడాలజీ(04 మార్కులు)
పార్ట్-6
గణితం కంటెంట్(08 మార్కులు)
గణితం బోధన శాస్త్రం (04 మార్కులు)
పార్ట్-7
సైన్స్ కంటెంట్ (8 మార్కులు)
సైన్స్ బోధన శాస్త్రం(4 మార్కులు)
పార్ట్-8
సోషల్ స్టడీస్ కంటెంట్ (08 మార్కులు)
సోషల్ మెథడాలజీ (04 మార్కులు)

స్కూల్ అసిస్టెంట్ తెలుగు

- జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ (10 మార్కులు)
- విద్య దృక్పదాలు(05 మార్కులు)
- విద్య మనోవిజ్ఞాన శాస్త్రం(05 మార్కులు)
- కంటెంట్(40 మార్కులు)
- మెథడాలజీ(20 మార్కులు)
- మొత్తంగా 80 మార్కులకు పరీక్ష ఉంటుంది

పార్ట్-1
జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్(10 మార్కులు)
పార్ట్-2
విద్యా దృక్పథాలు(05 మార్కులు)
పార్ట్-3
విద్య మనో విజ్ఞాన శాస్త్రం(05 మార్కులు)
పార్ట్-4
తెలుగు కంటెంట్(40 మార్కులు)
తెలుగు బోధన పద్ధతులు(20 మార్కులు)

స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్

- జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ (10 మార్కులు)
- విద్య దృక్పదాలు(05 మార్కులు)
- విద్య మనోవిజ్ఞాన శాస్త్రం (05 మార్కులు)
- కంటెంట్(40 మార్కులు)
- మెథడాలజీ(20 మార్కులు)
- మొత్తంగా 80 మార్కులకు పరీక్ష ఉంటుంది

పార్ట్-1
జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్(10 మార్కులు)
పార్ట్-2
విద్యా దృక్పథాలు(05 మార్కులు)
పార్ట్-3
విద్య మనో విజ్ఞాన శాస్త్రం(05 మార్కులు)
పార్ట్-4
ఫిజిక్స్ కంటెంట్(40 మార్కులు)
బోధన పద్ధతులు (20 మార్కులు)



డా. మంతెన రవికుమార్

స్కూల్ అసిస్టెంట్ గణితం

- జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ (10 మార్కులు)
- విద్య దృక్పదాలు(05 మార్కులు)
- విద్య మనోవిజ్ఞాన శాస్త్రం(05 మార్కులు)
- కంటెంట్(40 మార్కులు)
- మెథడాలజీ(20 మార్కులు)
- మొత్తంగా 80 మార్కులకు పరీక్ష ఉంటుంది

పార్ట్-1
జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్(10 మార్కులు)
పార్ట్-2
విద్యా దృక్పథాలు(05 మార్కులు)
పార్ట్-3
విద్య మనో విజ్ఞాన శాస్త్రం(05 మార్కులు)
పార్ట్-4
మేథ్స్ కంటెంట్(40 మార్కులు)
బోధన పద్ధతులు(20 మార్కులు)

స్కూల్ అసిస్టెంట్ బయాలజీ

- జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్(10 మార్కులు)
- విద్య దృక్పదాలు(05 మార్కులు)
- విద్య మనోవిజ్ఞాన శాస్త్రం(05 మార్కులు)
- కంటెంట్(40 మార్కులు)
- మెథడాలజీ(20 మార్కులు)
- మొత్తంగా 80 మార్కులకు పరీక్ష ఉంటుంది

పార్ట్-1
జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్(10 మార్కులు)
పార్ట్-2
విద్యా దృక్పథాలు(05 మార్కులు)
పార్ట్-3
విద్య మనో విజ్ఞాన శాస్త్రం(05 మార్కులు)
పార్ట్-4
బయాలజీ కంటెంట్(40 మార్కులు)
బయాలజీ మెథడాలజీ(20 మార్కులు)

స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్

- జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్(10 మార్కులు)
- విద్య దృక్పదాలు(05 మార్కులు)
- విద్య మనోవిజ్ఞాన శాస్త్రం(05 మార్కులు)
- కంటెంట్(40 మార్కులు)
- మెథడాలజీ(20 మార్కులు)
- మొత్తంగా 80 మార్కులకు పరీక్ష ఉంటుంది

పార్ట్-1
జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్(10 మార్కులు)
పార్ట్-2
విద్యా దృక్పథాలు(05 మార్కులు)
పార్ట్-3
విద్య మనో విజ్ఞాన శాస్త్రం(05 మార్కులు)
పార్ట్-4
సోషల్ కంటెంట్(40 మార్కులు)
సోషల్ బోధన పద్ధతులు(20 మార్కులు)

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

కలలన్నీ నిజమయ్యేలా



కమల్‌హాసన్ కథానాయకుడిగా మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్ థ్రిల్లర్ 'థగ్ లైఫ్'. 'నాయకుడు' చిత్రం విడుదలైన మూడున్నర దశాబ్దాల తర్వాత వీరిద్దరి కలయికలో వస్తోన్న చిత్రమిది. మాఫియా ముఠాల పగ, ప్రతీకారం నేపథ్యంలో సాగే కథతో 'థగ్ లైఫ్'ను ఆసక్తికరంగా తెరకెక్కించారు మణిరత్నం. హీరో శింబు ముఖ్యపాత్రను పోషిస్తున్నారు. త్రిష కథానాయిక. సాన్యా మల్హోత్రా, జోజూ జార్జ్, ఐశ్వర్యలక్ష్మి కీలకపాత్రలు పోషిస్తున్నారు. జూన్ 5న 'థగ్‌లైఫ్' ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఏ.ఆర్. రెహమాన్ సంగీత సారథ్యం వహించిన ఈ చిత్రం నుంచి తొలి గీతాన్ని మేకర్స్ ఆదివారం విడుదల చేశారు. 'కలలన్నీ నిజమయ్యేలా... జింగుచా జింగూచా' అంటూ వివాహ వేడుక నేపథ్యంలో ఉత్సాహంగా సాగే ఈ గీతానికి రెహమాన్ వినసొంపైన బాణీలను అందించారు. అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, మంగ్లీ, శ్రీకృష్ణ హృద్యంగా ఆలపించారు. కమల్‌హాసన్, మణిరత్నం, ఆర్. మహేంద్రన్, శివ ఆనంద్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రాన్ని ఎన్. సుధాకర్‌రెడ్డి తెలుగులో విడుదల చేస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రవి కే చంద్రన్

తెలుగువాడినని వద్దన్నారు




ఇటీవలె విడుదలైన హిందీ చిత్రం 'జాట్'తో హిట్ కొట్టారు దర్శకుడు గోపీచంద్ మలినేని. దాదాపు వంద కోట్లకు పైగా కలెక్షన్స్ సాధించిన ఆ చిత్రానికి సీక్వెల్‌నూ ప్రకటించారు. తాజాగా మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దర్శకుడిగా తనకు ఓ ప్రాజెక్ట్ విషయంలో ఎదురైన చేదు అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు గోపీచంద్. "బాలకృష్ణతో 'వీరసింహా రెడ్డి' సినిమా చేశాక, తదుపరి ప్రాజెక్ట్ కోసం తమిళ హీరో విజయ్‌కు కథ చెప్పా. సింగిల్ సిట్టింగ్‌లోనే ఆయన ఆ కథను ఓకే చేశారు. ఆ సమయంలోనే విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించారు. అప్పటికే ఆయన ఓ తెలుగు డైరెక్టర్‌తో 'వారీసు' (వారసుడు) చేశారు. మరో సినిమాను తెలుగువాడితో కాకుండా తమిళ దర్శకుడితోనే చేయమని ఆయనకు తమిళుల నుంచి ఒత్తిడి వచ్చింది అని అనుకుంటున్నాను. దాంతో ఆ ప్రాజెక్ట్ పట్టాలెక్కలేదు" అని పేర్కొన్నారు. ప్రస్తుతం బాలకృష్ణతో ఓ సినిమాను తెరకెక్కించే సన్నాహాల్లో ఉన్నారు గోపీచంద్ మలినేని.

యాక్షన్ హంగామా



దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా నటిస్తున్న కొత్త చిత్రం పట్టాలెక్కింది. నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి 'ఐ యామ్ గేమ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. దుల్కర్ సల్మాన్ నిర్మిస్తున్నారు. ఆదివారం తిరువనంతపురంలో పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ ప్రారంభించారు. కథానాయకుడిగా దుల్కర్‌కు ఇది 40వ చిత్రం. ఆంటోనీ వర్గీస్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రంతో తమిళ దర్శకుడు మిస్కిన్ నటుడిగా మలయాళ సినిమాల్లోకి అడుగుపెడుతున్నారు. 'దుల్కర్ కెరీర్లోనే భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న మలయాళ చిత్రమిది. ఇందులో ఆయన యాక్షన్ హంగామాను చూడబోతున్నారు. తిరువనంతపురంలో తొలి షెడ్యూల్ చిత్రీకరణ కొనసాగుతుంది. ఇతర వివరాలు త్వరలో వెల్లడిస్తాం' అని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, సినిమాటోగ్రఫీ: జిమ్షి ఖలీద్.

ముగింపు దశలో చిత్రీకరణ



పవన్ కల్యాణ్ సినిమా కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు శుభవార్త చెప్పారు 'హరి హర వీరమల్లు' మేకర్స్ జ్యోతి కృష్ణ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్ర షూటింగ్‌లో పవన్ పాల్గొన్నట్లు చిత్ర యూనిట్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. పవన్ ప్రస్తుతం రెండు రోజుల షూటింగ్‌లో పాల్గొంటారని, దీనితో సినిమా గ్రాండ్‌గా ఒక ముగింపు దశకు వచ్చేసినట్లేనని పేర్కొంది. అతి త్వరలోనే 'హరి హర వీరమల్లు' సాలిడ్ ట్రైలర్ సహా పాటలు విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. త్వరలోనే అధికారిక రిలీజ్ డేట్ కూడా రానున్నట్లు సమాచారం. ఈ భారీ చిత్రాన్ని ఏ.ఎం.రత్నం నిర్మిస్తుండగా ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

'తమ్ముడు' రాక ఖాయం



నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'తమ్ముడు'. ఆదివారం శ్రీరామ్ వేణు పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. జూలై 4న 'తమ్ముడు' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ప్రేక్షకులకు మర్చిపోలేని సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ఈ చిత్రంతో అందించబోతున్నట్లు దర్శకుడు చెప్పారు. ఈ చిత్రంలో వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కథానాయికలు. లయ కీలకపాత్ర పోషిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోకనాథ్, సినిమాటోగ్రఫీ: కేవీ గుహన్.

మరింత వినోదంతో...



హీరోయిన్ తాప్సీ పన్ను ఇటీవలె విడుదలైన 'ఫిర్ ఆయీ హసీనా దిల్‌రూబా' చిత్రంతో ప్రేక్షకులను పలకరించిన సంగతి తెలిసిందే. 2021లో విక్రాంత్ మస్సే, తాప్సీ జంటగా వినీల్ మాథ్యూ దర్శకత్వంలో తెరకెక్కిన 'హసీనా దిల్‌రూబా'కు ఇది సీక్వెల్. ఇవి నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలయ్యాయి. ఇప్పుడు ఈ చిత్రానికి మూడో భాగం కూడా రాబోతోందని హింట్ ఇచ్చారు రచయిత్రి కనికా ధిల్లాన్. ప్రస్తుతం స్క్రిప్టు పనులు జరుగుతున్నాయని.. మొదటి రెండు భాగాల కంటే మూడో భాగం మరింత వినోదంతో అలరించేలా ఉండబోతోందని తెలిపారు. ఈ రొమాంటిక్ థ్రిల్లర్ గురించి మరిన్ని వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు. ప్రస్తుతం 'గాంధారీ' చిత్రంతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధంగా ఉన్నారు తాప్సీ పన్ను.

ఆ ఒక్క రాత్రి.. జీవితాన్నే మార్చేసింది



నాని

ప్రస్తుతం 'హిట్ 3' అందించిన విజయాన్ని ఆస్వాదిస్తున్నారు హీరో నాని. తాజాగా, ఓ పాడ్‌కాస్ట్‌లో పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఓ ప్రమాదం తన జీవితాన్నే మార్చేసిందని తెలిపారు. "నేను నా మొదటి కారును కొనకముందు ఓ ప్రమాదం జరిగింది. నా మిత్రుడి కారులో లాంగ్‌డ్రైవ్ వెళ్లాం. చీకటిలో నేను నడుపుతున్న కారు రోడ్డుపై నిలిచిపోయి ఉన్న ఓ లారీని ఢీకొట్టింది. నాకూ, నా పక్కనే ఉన్న ప్రశాంత్ అనే మిత్రుడికీ తీవ్ర గాయాలయ్యాయి. ప్రశాంత్ స్పృహ కోల్పోయాడు. ప్రశాంత్.. ప్రశాంత్ అని గట్టిగా అరవడంతో ఆయన స్పృహలోకి వచ్చాడు. దాంతో ఊపిరి పీల్చుకున్నా. చికిత్స కోసం ఓ అంబులెన్స్‌లో హాస్పిటల్‌కు వెళ్తుంటే దారిలో మరో ప్రమాదం జరిగింది. ఆ ప్రమాదంలో ఓ కుటుంబమంతా తీవ్రంగా గాయపడ్డారు. అందులో ఓ చిన్న పాప కూడా ఉంది. మాతో పాటూ వారినీ అంబులెన్సులో తీసుకుని ఆస్పత్రికి వెళ్లాం. ఆ పాపను ఐసీయూలో ఉంచారు. అర్ధరాత్రి నుంచి ఉదయం వరకూ ఆ పాప పరిస్థితి తెలుసుకోవడానికి నేను వేచి చూశా. మరణం అంచులకు తీసుకెళ్లిన ఆ రాత్రి నన్ను పూర్తిగా మార్చేసింది. జీవితాన్ని చూసే కోణాన్ని, పలు విషయాలకు స్పందించే విధానాన్ని నేర్పింది" అని పేర్కొన్నారు.

పరోటా మాస్టర్‌గా విజయ్ సేతుపతి



విజయ్ సేతుపతి, నిత్యా మేనన్ జంటగా పాండిరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం టైటిల్‌ను 'తలైవా తలైవి' అని మేకర్స్ ఖరారు చేశారు. దీనిని ప్రకటిస్తూ తాజాగా టైటిల్ టీజర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో విజయ్ సేతుపతి పరోటా మాస్టర్‌గా నటిస్తున్నారు. అందుకోసం ఆయన కొంత శిక్షణ కూడా తీసుకున్నట్లు తెలిసింది. టీజర్‌లో..విజయ్ సేతుపతి, నిత్యామేనన్ వంట చేస్తూనే గొడవపడుతూ ఉంటారు. వారిద్దరు సరదాగా పోట్లాడుకుంటూ భార్యాభర్తలుగా కనిపిస్తారు. ఒకరిపై మరొకరు పెద్దగా అరుచుకుంటారు. చివరికి విజయ్ సేతుపతి నోటికి టవల్ కట్టుకొని తనలో తాను మాట్లాడుకుంటూ ఉండిపోతాడు. కాగా, ఈ చిత్రంలో టబు లీడ్ రోల్‌లో నటించనున్నారు. నటి రాధికా ఆప్టే కూడా త్వరలో ఈ ప్రాజెక్టులో భాగం కానున్నట్లు సమచారం. జూన్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయనున్నారు.

చీర కట్టులో అవని



మెగాస్టార్ చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'విశ్వంభర'. త్రిష కృష్ణన్ కథానాయిక. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తోంది. ఆదివారం త్రిష పుట్టిన రోజు సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ ప్రత్యేక పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో త్రిష అవని పాత్ర పోషిస్తున్నట్లు వెల్లడించారు. చీర కట్టులో త్రిష మెరిసిపోతూ కనిపించారు. 2006లో విడుదలైన 'స్టాలిన్' తర్వాత చిరంజీవి, త్రిష కలసి నటిస్తున్న చిత్రమిది. సృష్టి, స్థితి, లయ ఈ మూడింటి నేపథ్యంలో ఈ చిత్ర కథ సాగనున్నట్లు సమాచారం. సినిమాలో భారీ సన్నివేశాలు ఉంటాయని ఇప్పటికే చిత్ర యూనిట్ వెల్లడించింది. ఆంజనేయ భక్తునిగా చిరంజీవి కనిపించనున్నారు. ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

జానూతో ప్రేమ గీతం



రాజ్ తరుణ్ హీరోగా రామ్ కడుముల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ 'పాంచ్ మినార్'. రాశి సింగ్ కథానాయిక. గోవిందరాజు సమర్పణలో మాధవి, ఎం.ఎస్.ఎం రెడ్డి నిర్మిస్తున్నారు. చిత్ర బృందం ఆదివారం 'జానూ మేరీ జానూ' అంటూ సాగే ప్రేమగీతాన్ని విడుదల చేసింది. శ్రీహర్ష ఈమని సాహిత్యానికి శేఖర్‌చంద్ర స్వరాలు సమకూర్చగా, వినాయక్ ఆలపించారు. అజయ్ ఘోష్, బ్రహ్మాజీ, శ్రీనివాస్‌రెడ్డి, రవి వర్మ కీలకపాత్రలు పోషిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: ఆదిత్య జవ్వాది, ఎడిటర్: ప్రవీణ్ పూడి.

'తేనెటీగ రామారావు' కన్నుమూత



నిర్మాత జవాజి వెంకట రామారావు అలియాస్ తేనెటీగ రామారావు(68) ఆదివారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. కొంతకాలంగా లివర్ సంబంధ వ్యాధితో బాధపడుతున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాజేంద్రప్రసాద్‌తో 'తేనెటీగ, వంశీ దర్శకత్వంలో నరేశ్-వాణీ విశ్వనాథ్‌తో 'ప్రేమ అండ్ కో, శివకృష్ణతో 'బొబ్బిలివేట', 'బడి' వంటి చిత్రాలను నిర్మించడంతో పాటు పలు డబ్బింగ్ సినిమాలకు రామారావు నిర్మాతగా వ్యవహరించారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

పశ్చిమ డెల్టాకు 1316 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, మే 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెలాక్టు ప్రకాశం బ్యారేజి నుంచి 1316 క్యూసెక్కుల నీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.7 అడుగుల నీటిమట్టం ఉండగా రేపల్లెకాల్వకు 162, తూర్పుకాల్వకు 110, పశ్చిమకాల్వకు 88, నిజాంపట్నంకాల్వకు 165, కొమ్మమూరుకాల్వకు 653 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

గాలిగోపురం వద్ద అన్నదానం

మంగళగిరి, మే 4 (ఆంధ్రజ్యోతి): శ్రీ పేద, అనాథల మాతృ సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గాలి గోపురం సెంటరులో పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు లింగినేని శ్రీరామమూర్తి, ఉపాధ్యక్షుడు సాదరబోయిన నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన వెంకట నరసయ్య, కార్యదర్శి పేరం పూర్ణచంద్రరావు, కోశాధికారి యన్నం శివనాగేశ్వరరావు, ముద్రబోయిన హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



చినవడ్లపూడి-కాజల మధ్య బకింగ్‌హామ్ కాల్వలో పేరుకుపోయిన తూటికాడ, గుర్రపు డెక్కను పరిశీలించారు. తక్షణమే తొలగించి, ఖరీఫ్ సీజన్ నాటికి సాగునీటి ప్రవాహానికి అవరోధంగా మారకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. **(దుగ్గిరాల)**

మంగళగిరిలో గాలివాన బీభత్సం

మంగళగిరి, మే 4 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో ఆదివారం ఉదయం గాలివాన బీభత్సం సృష్టించింది. ఉదయం 8 గంటల నుంచి ఓ గంటపాటు భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతోపాటు పిడుగులు పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షం గంటసేపే కురిసినప్పటికీ మధ్యాహ్నం వరకు ఆకాశం మేఘావృతంగానే ఉంది. ఈదురు గాలుల ధాటికి పలుచోట్ల హోర్డింగ్‌లు నేలకొరిగాయి. ఉదయం పది గంటల వరకు జీనజీవనానికి అంతరాయం ఏర్పడింది. తీవ్రమైన ఎండ వేడిమి, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఆదివారం కురిసిన వర్షం కాస్తంత ఉపశమనం కలిగించింది.

నేడు మృతవీరుల స్మారక సభ

పెదనందిపాడు, మే 4(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పాలపర్రులో సోమవారం పాత బాపట్ల తాలూకా మృతవీరుల స్మారక సభ నిర్వహించనున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని, తొలుత గ్రామంలో ప్రదర్శన చేసి, మృతవీరుల స్మారక చిహ్నం వద్ద అమరవీరులకు నివాళులర్పించి, అనంతరం సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో కమ్యూనిస్టు నాయకులు పాల్గొనాలని కోరారు.

మూలవిరాట్ల గ్రామోత్సవం



ఊరేగింపు చేస్తున్న శ్రీసీతారాములు, లక్ష్మణ, అంజనేయస్వామి విగ్రహాలు

దుగ్గిరాల, మే 4 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని యాదవపాలెంలో ఈనెల 8వతేదీ గురువారం పునఃప్రతిష్ఠ జరుపుకోనున్న శ్రీ కోదండరామస్వామి ఆలయంలో తొలిరోజు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీసీతారాములవారు, ఆంజనేయస్వామి విగ్రహాలను ఊరేగించారు. ఆదివారం సాయంత్రం గం.6.30ని.లకు విష్వక్సేనపూజ, పుణ్యాహం, సంకల్పం ఆచార్య రుత్విగ్వరణం, అంకురార్పణ, మృత్సంగ్రహణం, అగ్నిప్రతిష్ఠ, కలశ స్థాపన, ఉక్తహోమాలు, నివేదన, హారతి కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

ఆలయానికి స్టీల్ బల్లల వితరణ



దాతలకు స్వామివారి జ్ఞాపకం అందజేస్తున్న ఆలయ ఈవో లీలాకుమార్

పెదకాకాని, మే 4 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అభిషేక క్యూలైనులలో భక్తులు కూర్చునేందుకు రూ.లక్ష రూపాయలు విలువ గల స్టీల్ బల్లలను భక్తులు ఆదివారం అందజేశారు. పెదకాకాని మండలం తక్కెళ్ళపాడుకు చెందిన నందిపాటి కోటేశ్వరరావు (చౌడేశ్వరరావు) అరుణకుమారి దంపతులు వారి కుటుంబ సభ్యులు ఒక లక్ష రూపాయలు విలువ కలిగిన 8 స్టీల్ బల్లలను దేవస్థాన కార్యనిర్వహణాధికారికి అందించారు. దాతలకు ప్రత్యేక దర్శనం, ఆలయ వేదపండితులు, అర్చకస్వాములతో వేద ఆశీర్వచనం చేయించి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, లడ్డు ప్రసాదం, చిత్రపటం అందజేసినట్లు ఆలయ ఉప కమిషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి, నిత్య అన్నప్రసాదానికి, గోశాల నిర్వహణకు దాతలు సహాయ సహకారాలు అందించాలని ఆలయ ఈవో భక్తులకు విజ్ఞప్తి చేశారు.

కన్నులపండువగా ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం

- వేలాదిగా పూజల్లో పాల్గొన్న భక్తులు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు

దుగ్గిరాల, మే 4 (ఆంధ్రజ్యోతి): కేఆర్ కొండూరులోని శ్రీమహంకాళీ అమ్మవారి దేవస్థానం పునః ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం గం7.49ని.లకు వేలాది మంది భక్తులు తిలకిస్తుండగా ఆలయపునఃప్రతిష్ఠ, రాజగోపుర శిఖర ప్రతిష్ఠ, ధ్వజస్థంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ నెల 2వ తేదీ నుంచి మూడు రోజులపాటు జరిగిన ప్రతిష్ఠా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం గం5.30లకు నిత్య పూజ విధులు, యంత్రపూజ, పీఠన్యాస, గర్భన్యాస, రత్నన్యాసాదుల అనంతరం కళాన్యాసాదుల, ప్రాణ ప్రతిష్ఠ, కుంభాభిషేకం, పూర్ణాహుతి, ఆచార్య సన్మానం, మహదాశీర్వచనం, అవభృధస్నానానం తరం అమ్మవారి అలంకరణ పూర్తిచేసి దర్శనానికి భక్తులను ఉదయం 10.30గంటల నుంచి అనుమతించారు. భక్తులు గాలి గోపురంలో నుంచి ఆలయ ఆవరణలోకి ప్రవేశించి, తొలిసారిగా అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. శ్రీవినాయక స్వామి, శ్రీసుబ్రహ్మణ్య స్వా మి దర్శనం ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించేందుకు ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 11 గంటల నుంచి అమ్మవారిని దర్శించుకుని వచ్చిన భక్తులకు ఆలయ పరిసరా ల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టెంట్‌లలో వేలాది మందికి అన్నదానం చేశారు. దేవదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ కే రామచంద్రమోహన్, సం యుక్త కమిషనర్ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ తదితరుల ఆదేశాలతో డిప్యూ టీ కమిషనర్ కే బసవేశ్వరశ్రీనివాసరావు పర్యవేక్షణలో ఈవో కోగంటి సునీల్ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా, ఏర్పాట్లను పర్యవేక్షించారు.



శ్రీమహంకాళీ అమ్మవారి శిఖర ప్రతిష్ఠలో పాల్గొన్న అర్చకులు, భక్తులు



ధ్వజస్థంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

రైతులు పట్టు పరిశ్రమ వైపు మొగ్గు చూపాలి

- పట్టుపరిశ్రమల శాఖ జిల్లా అధికారి బాలసుబ్రహ్మణ్యం

పెదనందిపాడు, మే 4 (ఆంధ్రజ్యోతి): రైతులు పట్టు పరిశ్రమ వైపు మొగ్గు చూపాలని జిల్లా పట్టు పరిశ్రమలశాఖ అధికారి బాలసుబ్రహ్మణ్యం అన్నారు. మండలపరిధిలోని వరగానిలో పట్టుపరిశ్రమపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టు పరిశ్రమ ఏర్పాటు చేసుకునే రైతులకు మల్బరీ పంట వేసుకునేందుకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. పట్టు పరిశ్రమ వల్ల రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని, ఇందుకు ప్రభుత్వం కూడా ప్రోత్సాహకం అందిస్తుందని తెలిపారు. పట్టు పరిశ్రమ గురించి రైతులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. ఒక్కొక్క రైతుకు 2.50 ఎకరాలకు సాగు చేసుకునేందుకు వీలుకలుగుతుందని, ఎస్సీ, ఎస్టీలకు రూ. 10లక్షల వరకు సబ్సిడీ కూడా ఉంటుందని, ఓసీలకు రు.8లక్షల వరకు సబ్సిడీ ఉంటుందని తెలిపారు. పరిశ్రమ స్థాపించుకోవాలనుకుంటే వివరాలకు జిల్లా పట్టుపరిశ్రమల అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ ఇన్‌చార్జ్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పట్టు పరిశ్రమల శాఖ జిల్లా అధికారి బాలసుబ్రహ్మణ్యం

వడ్డెర కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి

- సంఘం రాష్ట్ర కన్వీనర్ దయాకర్



సమావేశంలో ప్రసంగిస్తున్న సంఘం కన్వీనర్ దయాకర్

మంగళగిరి, మే 4 (ఆంధ్రజ్యోతి): వడ్డెర కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని ఏపీ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీ దయాకర్ డిమాండ్ చేశారు. మంగళగిరిలో ఆదివారం జరిగిన జిల్లా వడ్డెర వృత్తిదారుల సంఘం విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు వడ్డెరలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందే తప్ప ఎలాంటి నిధులు కేటాయించ లేదన్నారు. గుట్టలు, క్వారీలపై పూర్తి హక్కులను వడ్డెర వృత్తిదారులకే ఇవ్వాలని, వడ్డెరలు ఆర్థికంగా ఎదగడానికి సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ ఈమని అప్పారావు, నేతలు టీ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా జీ శంకర్, కార్యదర్శిగా టీ శ్రీరాములు, ఉపాధ్యక్షుడిగా వి.తిరుమలేష్, సహాయ కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా సీహెచ్ సుబ్బారాయుడు, మరో ముగ్గురు సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నట్టు ప్రకటించారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

- సీపీఎం నేత పాశం రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేత పాశం రామారావు

మంగళగిరి సిటీ, మే 4 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఈ నెల 20వ తేదీన జరుగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు పిలుపునిచ్చారు. మంగళగిరి సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆగ్జలరీ సభ్యుల రాజకీయ శిక్షణ తరగతిని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. రామారావు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు, కార్మికులు, యువత తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. ఈ పదేళ్లలో నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో మంగళగిరి ప్రాంతం నుంచి కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి వీసం జవహర్ లాల్, నేతలు ఈమని అప్పారావు, ఎం బాలాజీ, రాఘవులు, బాలకృష్ణ, బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతులను వెంటాడుతున్న అకాల వర్షాలు

కొల్లిపర, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు రైతులను వెంటాడుతూనే ఉన్నాయి. మొక్కజొన్న, జొన్న, పసుపు పంటలు చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలు కురియడంతో డెల్టా ప్రాంతంలోని రైతుల గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయి. గత రెండు రోజుల నుంచి చిరుజల్లులతో కూడిన వర్షం పడటంతో రబీ పంట ఇంటికి చేరుతోందో లేదో అని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ప్రతిరోజు ఒక్కసారిగా మబ్బులు కమ్ముకు రావటంతో పాటు వర్షం పడటంతో రైతులు కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న, జొన్న, పసుపు పంటలను కాపాడుకోవటానికి ఉరుకులు, పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. డెల్టా ప్రాంతమైన కొల్లిపర మండలంలో ఆదివారం ఆకస్మికంగా చిరుజల్లులతో కూడి న వర్షం పడింది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మండలంలోని వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, పిడపర్తిపాలెం, కొల్లిపర, తూములూరు, చివలూరు, అత్తోట, దావులూరు, చక్రాయపాలెం, హనుమాన్‌పా లెం తదితర గ్రామాల్లో మొక్కజొన్న, జొన్న పంటలను రైతులు నూర్పిళ్ళు చేసి కల్లాలో ఆరబెట్టారు. చిరుజల్లులతో కూడిన వర్షం పడటంతో కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న, జొన్న పంటలు ఎక్కడ దెబ్బతింటాయోనని రైతులు మరింత ఆందోళనకు గురయ్యారు. భారీ వర్షం పడితే పొలాల్లో ఎక్కడ నీరు నిలిచి పంట మొత్తం దెబ్బతింటుందేమోనని రైతులు భయపడి హడావిడిగా కల్లాలో ఆరబెట్టిన మొక్కజొన్నలను, జొన్నలను ట్రాక్టర్ల ద్వారా గ్రామాల్లోకి తరలించారు. మరి కొంతమంది రైతులు వర్షానికి పంటలు తడవకుండా కల్లాలోనే పట్టాలు కప్పారు. అదేవిధంగా పసుపు రైతులు కూడా కల్లాలో ఎండ బెట్టిన పసుపును గోతాలకు ఎత్తి ట్రాక్టర్ల ద్వారా గృహాలకు తరలించారు. ఇటుక పరిశ్రమ రైతులు వాతావరణంలో వచ్చిన మార్పులను గమనించి ఇటుక బట్టీలకు హడావిడిగా ప్లాస్టిక్ పట్టాలను కప్పించారు.



కొల్లిపరలో ఇటుక బట్టీ తడవకుండా పట్టాలు కప్పుతున్న కూలీలు



కొల్లిపర మండలం అన్నవరం సమీపంలో గాలులకు పడిపోయిన అరటి చెట్లు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరం

- వారం పాటు ఏకనామం కార్యక్రమం
- 13న స్వామి వారి కల్యాణ మహోత్సవం

పెదనందిపాడు, మే 4(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి గాంచిన మండలపరిధిలోని నాగులపాడు శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలకు కమిటీ నిర్వాహకులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ దేవస్థానం 11 దశాబ్దాలుగా ఆధ్యాత్మికతకు నిలయంగా మారింది. రాష్ట్ర నలుమూలల నుంచి ఈ దేవస్థానానికి వారంలో రెండు పర్యాయాలు భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటూ ఉంటారు. ఆలయంలో స్వామికి నిత్యపూజలు జరుగుతూనే ఉంటాయి. ఈ ప్రాంతంలో నివసించే వారు తమ పిల్లలకు స్వామి పేరులోని నాగరాజు, నాగవల్లీ, నాగేశ్వరరావు అనే పేర్లతో నామకరణం చేస్తుంటారు. మే 6 నుంచి 13వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. దీనిలో భాగంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. దేవస్థానంలో 49 శిరస్సులు గల పంచలోహ విగ్రహంపై పాలరాతి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి భక్తులకు దర్శనమిస్తుంటారు. దూర ప్రాంతాల నుంచి ఒక రోజు ముందుగానే ఇక్కడకు చేరుకుని పుట్టపోగులు పేరుతో పిల్లలకు చెవులు కుట్టించడం తలనీలాలు అర్పించి మొక్కుబడులు తీర్చుకుంటారు. వివాహం, సంతానం లేని వారు వార్లు పోసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తే అనుకున్న కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం.

చిన్నారులకు కరాటే బెల్ట్ టెస్ట్ పోటీలు



కరాటే బెల్ట్ టెస్ట్ పోటీల్లో సర్టిఫికెట్లు పొందిన చిన్నారులు

మంగళగిరి సిటీ, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీనారాయణ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న మార్షల్ ఆర్ట్స్ అండ్ కరాటే కోచింగ్ సెంటరులో ఆదివారం చిన్నారులకు బెల్ట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. మంగళగిరి పట్టణంతోపాటు కాజ, పెదవడ్లపూడి గ్రామాల నుంచి, ఎంఎంకే స్టేడియంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు వంద మంది హాజరయ్యారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన చిన్నారులకు సర్టిఫికెట్లను అందజేశారు. సీఐడీ ఎస్పీ కడియం చక్రవర్తి ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారులను అభినందించా రు. ఈ కార్యక్రమంలో కరాటే సీనియర్ మాస్టర్ జీవీ నరసయ్య, జపాన్ సిటోరియో టెక్నికల్ డైరెక్టర్ గంజి కులశేఖర్, జీ రామచంద్రరావు, జపాన్ సిటోరియో ఏపీ ప్రధాన కార్యదర్శి డీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

తాడికొండ, మే 4(ఆంధ్రజ్యోతి): తాడికొండలో ఆదివారం నిర్వహించిన శంకర కంటి ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. వైద్య శిబిరంలో 98 మందికి కంటి పరీక్షలు చేయగా వారిలో 54 మందికి కంటి శుక్లాలు గుర్తించినట్లు వైద్యులు తెలిపారు. 54 మందికి ఉచితంగా శుక్లాల ఆపరేషన్లు చేయనున్నట్లు వైద్యులు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరి బండ్ల కోటేశ్వరరావు, ధనేకుల హరిబాబు, నీలాద్రి వెంకటేశ్వరరావు, కొలికపూడి సామేలు, డాక్టర్లు అరుణ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఆహ్వాన నాటికల పోటీలు



అసత్యం నాటికలో సన్నివేశం

తెనాలి అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరులో నిర్వహిస్తున్న ఆహ్వాన నాటికల పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. కొలంకపూరి నాటక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో చివరి రోజు మూడు నాటికలు ప్రదర్శించారు. విశాఖపట్నం చైతన్య కళా స్రవంతి కళాకారులు ప్రదర్శించిన అసత్యం నాటికను బాలాజీ నాయక్ దర్శకత్వం వహించారు. కంటికి కనిపించేది అంతా సత్యం కాదు కనిపించనిదంతా అసత్యం కాదు అబద్ధమైనా ఒక మంచికి దోహదపడితే సత్యమంటూ సందేశం అందించింది. శ్రీకాకుళం లలితశ్రీ కళాసమితి కళాకారులు ప్రదర్శించిన మతమా మానవత్వమా నాటికను సూర్యప్రకాశరావు రచించగా రామలింగస్వామి దర్శకత్వం వహించారు. మతం మత్తులో సమాజం చీలిపోతూ కక్షలు, కర్పణ్యాలతో నిండిపోతున్న తరుణంలో మానవత్వమే మనిషి మనుగడకు శాశ్వతమని కళాకారులు చాటి చెప్పారు. కొలకలూరు సాయి ఆర్ట్స్ కళాకారులు ప్రత్యేక ప్రదర్శనను మాధవ్ రచించగా గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. గోపరాజు బాలత్రిపురసుందరమ్మ జీవిత సాఫల్య పురస్కారాన్ని రంగస్థల, టీవీ నటి సురభి ప్రభావతికి, శిల్పి మదన్‌మోహన్ సాఫల్య పురస్కారాన్ని రంగస్థల రూపశిల్పి పచ్చల శేషగిరికి ప్రదానం చేశారు. పరిషత్ సభ్యులు పర్యవేక్షించారు.

భగీరథ జయంతి వేడుకల్లో మంత్రి లోకేశ్

మంగళగిరి సిటీ, మే 4 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి సగర భగీరథ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జరిగిన శ్రీభగీరథ మహర్షి జయంతి వేడుకల్లో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. గౌతమబుద్ధ రోడ్డులోని ఎర్ర చెరువు వద్ద గల భగీరథ మహర్షి విగ్రహాన్ని దర్శించుకుని పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి మంత్రి లోకేశ్‌కు ఆశీర్వచనాలు అందజేశారు. మంత్రి లోకేశ్ రాకను పురస్కరించుకుని సంఘ పెద్దలు, స్థానికులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయ రావు, కాంద్రు శ్రీనివాసరావు, వాకా మాధవరావు, గోవాడ దుర్గారా వు, సంకా బాలాజీగుప్తా, జొన్నాదుల బాలకృష్ణ, కారంపూడి అంకమ్మరావు, సగర భగీరథ సంఘం అధ్యక్షుడు పందేటి తిరుపతయ్య, నేతలు నక్కా బాల కోటే శ్వరరావు, జంపని వీరశ్రీనివాసరావు, జలసూత్రం రవి, కగ్గా వెంకటేశ్వర రావు, గజ్జల వెంకయ్య, కర్నాటి సత్యనారాయణ, కఠారి కొండలు, నక్కా శ్రీను, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



భగీరథ మహర్షి విగ్రహానికి నమస్కరిస్తున్న మంత్రి నారా లోకేశ్

వేసవి ఈత శిక్షణ శిబిరం ప్రారంభం



ఈత శిక్షణను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు

తాడేపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): అమరావతి కరకట్ట రోడ్డులో ఉన్న ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిన్న పిల్లల ఈత శిక్షణా శిబిరం ఆదివారం ప్రారంభమైంది. గోకరాజు గంగరాజు గెస్ట్ హౌస్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్ నందు అసోసియేషన్ లైఫ్ చైర్మన్, మాజీ పార్లమెంటు సభ్యుడు గోకరాజు గంగరాజు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 17 సంవత్సరాలుగా పిల్లలకు ప్రతి ఏటా ఈతలో శిక్షణ ఇవ్వడం ఎంతో సంతోషమని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు లింగినేని రామకృష్ణ, కార్యదర్శి వైపీ రమేష్‌కుమార్, కోశాధికారి కేవీ రామయ్య, కన్వీనర్ చెల్లారి జోజిబాబు, ఉపాధ్యక్షుడు గోపాళం సాంబశివరావు, సహాయ కార్యదర్శులు అమ్మిరెడ్డి రామిరెడ్డి, గుండు జనార్ధన రావు, కేఎస్ రామచంద్రరావు, ఎం నరసరాజు, వెంకటరెడ్డి, వి.రాము, సాంబయ్య, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వింజనంపాడులో పోలేరమ్మ, అద్దంకమ్మ తిరునాళ్ల

వట్టిచెరుకూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వింజనంపాడు గ్రామంలో పోలేరమ్మ, అద్దంకమ్మ తిరునాళ్ళ మహోత్సవం ఆదివారం గ్రామంలో పావనం ఊరేగింపుతో ప్రారంభమైంది. తిరునాళ్ళలో భాగంగా సోమవారం అమ్మవార్లకు కుంకుమ బళ్ళతో గ్రామంలో ఊరేగుతూ దేవాలయానికి చేరుకొని అమ్మవార్లకు కుంకుమ సమర్పిస్తారు. మంగళవారం తిరునాళ్ళ మహోత్సవంలో ప్రధాన ఘట్టమైన సిడిమాను మహోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటికే పూర్తి సన్నాహాలు చేస్తున్నారు. మంగళవారం ఉదయం గ్రామంలో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం, సాయంత్రం సిడిమాను మహోత్సవం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు. తిరునాళ్ల సందర్భాన్ని పురస్కరించుకొని దేవాలయంతో పాటు ప్రధాన వీధుల్లో విద్యుత్ దీపాలతో అలంకరించారు.



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కంటి వైద్యశిబిరం విజయవంతం



నుదురుపాడులో మెగా నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న గుర్రాల శివయ్య

ఫిరంగిపురం, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని నుదురుపాడులో నరసరావుపేట ఈశ్వర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆస్పత్రి వారి సౌజన్యంతో మండలంలోని నుదురుపాడు గ్రామం నందు ఆదివారం మెగా నేత్ర శిబిరం విజయవంతంగా జరిగింది. ఈ శిబిరాన్ని మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుర్రాల శివయ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ మెగా క్యాంపులో 234 మంది స్త్రీలు, 259 మంది పురుషులు, 34 మంది చిన్న పిల్లలు తదితరులకు వైద్య పరీక్షలు జరపగా 184 మంది కంటి శస్త్ర చికిత్సలకు అర్హులయ్యారని వారు తెలిపారు. రెండు రోజులుగా 2075 మందికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేయించుకున్నారని ట్రస్ట్ తెలిపింది. వైద్యశిబిరంలో ఈశ్వర్ కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, కరస్పాండెంట్ షేక్ కరీం మొహిద్దీన్, మస్తాన్ షరీఫ్, హెచ్ గంగాధర్, కొసన నాగరాజు, వేల్పూరి నాగరాజు, సర్పంచ్ గొట్టం చౌడయ్య, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, వైద్యులు షేక్ వసీం మీర, షఫాలి, శృతి, ఆడియాలజిస్టు డాక్టర్ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

భావదేవుని బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

పొన్నూరు టౌన్, మే, 4 (ఆంధ్రజ్యోతి): శ్రీసుందరవల్లీ రాజ్యలక్ష్మీసమేత సాక్షి భావన్నారాయణ స్వామి బ్రహ్మోత్సవాలకు ఆదివారం అంకురార్పణ జరిగింది. స్వామివారి కల్యాణ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలకు శ్రీకారం చుట్టిన సందర్భంగా గరుడ పతాకానికి పూజలు నిర్వహించి ఆకాశదీపం వెలిగించి పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన నాగస్వర కచేరి భక్తులను ఆకట్టుకుంది.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

35 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మే. 4 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని చేబ్రోలు పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. చేబ్రోలు పోలీసుల కథనం ప్రకారం మండల పరిధిలోని మంచాల గ్రామ శివారులో అనుమానాస్పదంగా వెళ్తున్న టాటా ఏస్ వాహనాన్ని ఆపి తనిఖీలు నిర్వహించగా వాహనంలో 35 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఆటోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి చేబ్రోలు దర్యాప్తు ప్రారంభించారు.



స్వాధీనం చేసుకున్న ట్రక్ ఆటో



ప్రత్యేక అలంకరణలో శ్రీసాక్షిభావన్నారాయణ స్వామి

భావదేవుని బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

పొన్నూరు టౌన్, మే. 4 (ఆంధ్రజ్యోతి): శ్రీసుందరవల్లీ రాజ్యలక్ష్మీసమేత సాక్షిభావన్నారాయణ స్వామి బ్రహ్మోత్సవాలకు ఆదివారం అంకురార్పణ జరిగింది. స్వామివారి కల్యాణ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలకు శ్రీకారం చుట్టిన సందర్భంగా గరుడ పతాకానికి పూజలు నిర్వహించి ఆకాశదీపం వెలిగించి పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన నాగస్వర కచేరి భక్తులను ఆకట్టుకుంది.

కేజీఎఫ్ కార్యాలయం ప్రారంభం

తెనాలి అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రకాశం రోడ్డులో ఏర్పాటుచేసిన కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. సంస్థ వ్యవస్థాపకులు జెట్టి కుసుమకుమార్ ఆదేశాలకనుగుణంగా తెనాలి ప్రాంతంలో ఫౌండేషన్ కార్యకలాపాలు జరుగుతాయని పట్టణ కమిటీ అధ్యక్షుడు జెట్టి శివరామకృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కమ్మ సామాజిక వర్గ అభివృద్ధికి తోడ్పాటు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో నాగభూషణం, నాగేశ్వరరావు, అంకినీడు, శంకరప్రసాద్, బాపయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని కార్మికుడు ఆత్మహత్య

తెనాలిరూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పాండురంగపేటకు చెందిన గుండాల గోపి (36) తెనాలి మునిసిపాలిటీలో పారిశుధ్య విభాగంలో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తుంటాడు. ఇతడికి వివాహమై కుమారుడున్నాడు. మద్యం అలవాటు ఉన్న గోపి గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ శనివారం రాత్రి ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శ్రీరామచంద్రమూర్తికి సహస్ర కలశాభిషేకం

తెనాలిరూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగలకుదురులో ఆంధ్రవాల్మీకి వాసుదాసుస్వామి పరంపరపీఠం దాసకూటి ఆశ్రమంలో ఆదివారం శ్రీ సీతారామ స్వామి వారి సహస్ర కలశాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి సీతారామదాసు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



వెల్లలూరులోని దుక్కిదేవమ్మ అమ్మవారు

భక్తిశ్రద్ధలతో దుక్కిదేవమ్మ తిరునాళ్ల

పొన్నూరు టౌన్, మే. 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెల్లలూరులోని గ్రామదేవత దుక్కిదేవమ్మ తిరునాళ్ల ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకుని గ్రామస్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెల్లలూరు వాసులు భక్తిశ్రద్ధలతో కొలిచే దుక్కిదేవమ్మకు మహిళలు పొంగళ్లు సమర్పించి, పూజలు జరిపారు. సాయంత్రం గ్రామ యువత ఆధ్వర్యంలో మూడు భారీ విద్యుత్ ప్రభలు నిర్మించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రభల ఉత్సవం కన్నులపండువగా సాగింది. దుక్కిదేవమ్మ తిరునాళ్లకు వెల్లలూరు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు హాజరయ్యారు. రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

మున్సిపాలిటీ పిలుపునకు స్పందన నిల్

- సెట్‌బ్యాక్ నిబంధనలతో పడిపోయిన ఆదాయం
- భవన నిర్మాణాల కోసం ఒక్క దరఖాస్తు రాని వైనం

తెనాలి అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణాలకు స్వీయ ధ్రువీకరణలతో అనుమతి పొందాలంటూ మున్సిపల్ అధికారులు ఇచ్చిన పిలుపునకు స్పందన లేకుండా పోయింది. సెట్‌బ్యాక్ నిబంధనల కారణంగా పట్టణంలో భవన నిర్మాణాలు నిలిచిపోయాయి. జనవరిలో పురపాలక శాఖ జారీచేసిన జీవో కారణంగా ఒక్కరు కూడా భవన నిర్మాణాల కోసం ప్లాన్‌లు దాఖలు చేయలేదు. ఫలితంగా నిర్మాణాల ద్వారా మున్సిపాలిటీకి గణనీయంగా వచ్చే ఆదాయానికి గండిపడింది. పట్టణంలో ఇళ్లు నిర్మించుకునేవారు తమకు ఉన్న స్థలాన్ని బట్టి సెట్‌బ్యాక్ వదిలి పెట్టాల్సి ఉంది. ఇంటి చుట్టూ ఖాళీ వదలాలి అనేది సహజం కానీ ఆ ఖాళీలోకి శ్లాబ్ వెల్లుడు కూడా రాకూడదని, వెల్లుడు రావాలంటే రెట్టింపు వదిలి పెట్టాలని జీవోలో సెలవిచ్చారు. ఈ ప్రకారంగా సర్వేయర్లు ప్లాన్ రూపొందించి ఆన్‌లైన్‌లో దాఖలుచేసి ఫీజు చెల్లిస్తే అనుమతులు చకచకా వస్తాయని చెప్పారు. ప్లాన్ ప్రకారం భవనం నిర్మించకపోతే సర్వేయర్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు జరిమానాలు కూడా ఉంటాయని స్పష్టం చేశారు. ఈ తలనొప్పి మాకెందుకని సర్వేయర్లు ప్లాన్‌లు వేయడం మానేశారు. ఎవరైనా ప్లాన్ అడిగితే నిబంధనలు తూచ తప్పకుండా పాటించి నిర్మాణం చేస్తామని, స్పష్టమైన రాత పూర్వక హామీ ఇస్తేనే ప్లాన్ వేస్తామంటున్నారు. దీంతో ఇళ్ల ప్లాన్‌లు లేవు. నిర్మాణాలు లేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు పట్టణంలో పలుచోట్ల హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు.



ఇళ్ల నిర్మాణాల అనుమతులకు ఏర్పాటుచేసిన బోర్డు

స్వీయ ధ్రువీకరణతో ఇంటి నిర్మాణానికి అనుమతి పొందాలని, బాధ్యత వహించాలని త్వరగా అనుమతి ఇస్తామంటూ ఇందుకోసం హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలన్నారు. అయితే మున్సిపల్ అధికారులు వేసిన ఈ ఎత్తు పారలేదు. సెట్‌బ్యాక్‌లు అంతంత వదిలితే ఇల్లు ఎక్కడ పడుతుందంటూ స్థల యజమానులు ప్రశ్నించడంతో ప్రస్తుతానికి అంతే అంటూ హెల్ప్ డెస్క్ సమాధానం ఇస్తుంది. ఏ ఒక్కరి నుంచి కూడా స్వీయ ధ్రువీకరణ ఇచ్చే ప్లాన్ కోసం దరఖాస్తు చేయలేదని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ఈ జీవోవల్ల మున్సిపల్ ఆదాయం పడిపోవడమే కాకుండా భవన నిర్మాణ రంగంపై ఆధారపడిన ఎంతో మందికి జీవనోపాధి లేకుండా పోయింది. ఈ పరిస్థితులను చక్కదిద్దాల్సిన బాధ్యత మున్సిపల్ శాఖ మంత్రి, అధికారులపై ఉందని, వెంటనే స్పందించాలని లేకుంటే ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుందని పలువురు సూచిస్తున్నారు.





కొల్లిపర మండలం అన్నవరం సమీపంలో గాలులకు పడిపోయిన అరటి చెట్లు, కొల్లిపరలో ఇటుక బట్టీ తడవకుండా పట్టాలు కప్పుతున్న కూలీలు

రైతులను వెంటాడుతున్న అకాల వర్షాలు

కొల్లిపర, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు రైతులను వెంటాడుతూనే ఉన్నాయి. మొక్కజొన్న, జొన్న, పసుపు పంటలు చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలు కురియడంతో డెల్టా ప్రాంతంలోని రైతుల గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయి. గత రెండు రోజుల నుంచి చిరుజల్లులతో కూడిన వర్షం పడటంతో రబీ పంట ఇంటికి చేరుతోందో లేదో అని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ప్రతిరోజు ఒక్కసారిగా మబ్బులు కమ్ముకు రావటంతో పాటు వర్షం పడటంతో రైతులు కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న, జొన్న, పసుపు పంటలను కాపాడుకోవటానికి ఉరుకులు, పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. డెల్టా ప్రాంతమైన కొల్లిపర మండలంలో ఆదివారం వాతావరణంలో ఆకస్మికంగా మార్పు చోటు చేసుకుని మబ్బులు కమ్ముకొచ్చి చిరుజల్లులతో కూడిన వర్షం పడింది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మండలంలోని వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, పిడపర్తిపాలెం, కొల్లిపర, తూములూరు, చివలూరు, అత్తోట, దావులూరు, చక్రాయపాలెం, హనుమాన్‌పాలెం తదితర గ్రామాల్లో మొక్కజొన్న, జొన్న పంటలను రైతులు నూర్పిళ్ళు చేసి కల్లాలో ఆరబెట్టారు. చిరుజల్లులతో కూడిన వర్షం పడటంతో కల్లాలో ఆరబెట్టిన మొక్కజొన్న, జొన్న పంటలు ఎక్కడ దెబ్బతింటాయేమోనని రైతులు మరింత ఆందోళనకు గురయ్యారు. భారీ వర్షంపడితే పొలాల్లో ఎక్కడ నీరు నిలిచి పంట మొత్తం దెబ్బతింటుందేమోనని రైతులు

● దిక్కుతోచని స్థితిలో రైతన్నలు

భయపడి హడావిడిగా కల్లాలో ఆరబెట్టిన మొక్కజొన్నలను, జొన్నలను ట్రాక్టర్ల ద్వారా గ్రామాల్లోకి తరలించారు. మరి కొంతమంది రైతులు వర్షానికి పంటలు తడవకుండా కల్లాలోనే పట్టాలు కప్పారు. అదే విధంగా పసుపు రైతులు కూడా కల్లాలో ఎండబెట్టిన పసుపును గోతాలకు ఎత్తి ట్రాక్టర్ల ద్వారా గృహాలకు తరలించారు. ఇటుక పరిశ్రమ రైతులు వాతావరణంలో వచ్చిన మార్పులను గమనించి ఇటుక బట్టీలకు హడావిడిగా ప్లాస్టిక్ పట్టాలను కప్పించారు. సాయంత్రానికి ఎండ రావడంతో మండల గ్రామాల రైతులు ఊపిరిపీల్చుకున్నారు.

సద్దు మణిగిన వాసవీ ఆలయ కమిటీ వర్గపోరు

- ఎస్పీ వద్ద కుదిరిన పంచాయతీ
- మధ్యవర్తి మునగాలకు బాధ్యతలు

తెనాలి అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీల వర్గపోరు ప్రస్తుతానికి సద్దుమణిగింది. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఇరువర్గాలను పిలిచి మాట్లాడారు. దీంతో ఆదివారం పాత కమిటీ తలపెట్టిన సర్వసభ్య సమావేశం రద్దు చేసుకుంటున్నట్లు కమిటీ ప్రతినిధులు విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. పాత కమిటీ ప్రతినిధి కొనిజేటి గోపి, దేసు శ్రీనివాసరావులు మాట్లాడుతూ, కొత్త కమిటీ ఎన్నిక, ప్రమాణ స్వీకారంపై హైకోర్టులో రిట్ పిటిషన్ వేశామని, ఈ నేపథ్యంలో సర్వ సభ్య సమావేశం ఎలా పెడతారని ఎస్పీ ప్రశ్నించినట్లు చెప్పారు. కోర్టు కేసు తేలిన తరువాతే సమావేశం ఉంటుందని చెప్పారు. అదేవిధంగా కొత్త కమిటీ ఎన్నిక జరిగిన విధానాన్ని ఆరాతీసి బైలాను కూడా ఎస్పీ తీసుకున్నట్లు చెప్పారు.. కోర్టులో కేసు తేలేవరకు ఇరువర్గాల కమిటీల ప్రతినిధులకు నచ్చజెప్పి అప్పటివరకు మధ్యవర్తిగా ఆలయ వ్యవహారాలు చక్కబెట్టే బాధ్యతను ఇరువర్గాలు అంగీకరించే వ్యక్తిని సూచించాలని ఎస్పీ కోరారు. పారిశ్రామికవేత్త డబుల్ హార్స్ ఎండీ మునగాల మోహన్ శ్యాంప్రసాద్‌కు అప్పగించాలని రెండు వర్గాలు సమ్మతించడంతో వివాదానికి ఫుల్‌స్టాప్ పడింది.



అసత్యం నాటికలో ఓ సన్నివేశం

ముగిసిన ఆహ్వాన నాటికల పోటీలు

తెనాలి అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరులో నిర్వహిస్తున్న ఆహ్వాన నాటికల పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. కొలంకపూరి నాటక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో చివరి రోజు మూడు నాటికలు ప్రదర్శించారు. విశాఖపట్నం చైతన్య కళా స్రవంతి కళాకారులు ప్రదర్శించిన అసత్యం నాటికను బాలాజీ నాయక్ దర్శకత్వం వహించారు. కంటికి కనిపించేది అంతా సత్యం కాదు కనిపించనిదంతా అసత్యం కాదు అబద్ధమైనా ఒక మంచికి దోహదపడితే సత్యమంటూ సందేశం అందించింది. శ్రీకాకుళం లలితశ్రీ కళాసమితి కళాకారులు ప్రదర్శించిన మతమా మానవత్వమా నాటికను సూర్యప్రకాశరావు రచించగా రామలింగ స్వామి దర్శకత్వం వహించారు. మతం మత్తులో సమాజం చీలిపోతూ కక్షలు, కర్పణ్యాలతో నిండిపోతున్న తరుణంలో మానవత్వమే మనిషి మనుగడకు శాశ్వతమని కళాకారులు చాటి చెప్పారు. కొలకలూరు సాయి ఆర్ట్స్ కళాకారులు ప్రత్యేక ప్రదర్శనను మాధవ్ రచించగా గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. గోపరాజు బాలత్రిపురసుందరమ్మ జీవిత సాఫల్య పురస్కారాన్ని రంగస్థల, టీవీ నటి సురభి ప్రభావతికి, శిల్పి మదన్‌మోహన్ సాఫల్య పురస్కారాన్ని రంగస్థల రూపశిల్పి పచ్చల శేషగిరికి ప్రదానం చేశారు. పరిషత్ సభ్యులు పర్యవేక్షించారు.

చిన్నారులకు వేసవి ఈత శిక్షణ శిబిరం ప్రారంభం

తాడేపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): అమరావతి కరకట్ట రోడ్డులో ఉన్న ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిన్న పిల్లల ఈత శిక్షణ శిబిరం ఆదివారం ప్రారంభమైంది. గోకరాజు గంగరాజు గెస్ట్ హౌస్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో అసోసియేషన్ లైఫ్ చైర్మన్, మాజీ పార్లమెంటు సభ్యుడు గోకరాజు గంగరాజు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 17 సంవత్సరాలుగా పిల్లలకు ప్రతిఏటా ఈతలో శిక్షణ ఇవ్వడం ఎంతో సంతోషమన్నారు.

ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు లింగినేని రామకృష్ణ, కార్యదర్శి వైవీ రమేష్‌కుమార్, కోశాధికారి కేవీ రామయ్య, కన్వీనర్ చెల్లారి జోజిబాబు, ఉపాధ్యక్షుడు గోపాళం సాంబశివరావు, సహాయ కార్యదర్శులు అమ్మిరెడ్డి రామిరెడ్డి, గుండు జనార్ధనరావు, కేఎస్ రామచంద్రరావు, ఎం.నరసరాజు, వెంకటరెడ్డి, వి.రాము, సాంబయ్య, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



దాతలకు స్వామివారి జ్ఞాపకం అందజేస్తున్న ఆలయ ఈవో లీలాకుమార్

మల్లేశ్వరస్వామి దేవస్థానానికి స్టీల్ బల్లల వితరణ

పెదకాకాని, మే 4 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అభిషేక క్యూలైనులలో భక్తులు కూర్చునేందుకు రూ.లక్ష రూపాయలు విలువ గల స్టీల్ బల్లలను భక్తులు ఆదివారం అందజేశారు. పెదకాకాని మండలం తక్కెళ్ళపాడుకు చెందిన నందిపాటి కోటేశ్వరరావు (చౌడేశ్వరరావు) అరుణకుమారి దంపతులు వారి కుటుంబ సభ్యులు ఒక లక్ష రూపాయలు విలువ కలిగిన 8 స్టీల్ బల్లలను దేవస్థాన కార్యనిర్వహణాధికారికి అందించారు. దాతలకు ప్రత్యేక దర్శనం, ఆలయ వేదపండితులు, అర్చకస్వాములతో వేద ఆశీర్వచనం చేయించి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, లడ్డు ప్రసాదం, చిత్రపటం అందజేసినట్లు ఆలయ ఉప కమిషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి, నిత్య అన్నప్రసాదానికి, గోశాల నిర్వహణకు దాతలు సహాయ సహకారాలు అందించాలని ఆలయ ఈవో భక్తులకు విజ్ఞప్తి చేశారు.

ప్రతి మనిషిలోనూ సామాజిక బాధ్యత ఉండాలి

● విశ్రాంత ఐఏఎస్ అధికారి ముక్తేశ్వరరావు

తెనాలి అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): సమాజం కోసం సామాజిక బాధ్యత ప్రతి మనిషిలోనూ ఉండాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు అన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థ మానవత సర్వసభ్య సమావేశం ఆదివారం ఏఎస్ఎన్ కళాశాలలో నిర్వహించారు. కొలసాని రాంచంద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన అందించిన సేవలను పురస్కరించుకుని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజం కోసం సంస్థ పడుతున్న తపనను అభినందించారు. సేవా కార్యక్రమాలను నిర్వహించడం కోసం దాతలు మరింత చేయూత అందించాలన్నారు. విశ్రాంత జీవనాన్ని సమాజ సేవలో గడపడం ఆరోగ్యంతో పాటు ఆనందాన్ని, సంతృప్తిని అందజేస్తుందని చెప్పారు. రీజనల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, రవీంద్రనాథ్, ప్రసాద్, వెంకట్, దాసు, సోమయ్య, శర్మ పాల్గొన్నారు. సాహిత్యవేత్త అయినాల మల్లేశ్వరరావు రచించిన సూక్తినిధి పుస్తకాన్ని ఆవిష్కరించారు.



విశ్రాంత ఐఏఎస్ అధికారి ముక్తేశ్వరరావును సన్మానిస్తున్న సంస్థ ప్రతినిధులు



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్ తదితరులు

సాక్షి భావన్నారాయణస్వామి ఆలయంలో పురాణ కాలక్షేప మండపానికి శంకుస్థాపన

పొన్నూరు టౌన్, మే. 4 (ఆంధ్రజ్యోతి): శ్రీసుందరవల్లి రాజ్యలక్ష్మీ సమేత సాక్షిభావన్నారాయణస్వామి ఆలయంలో రూ.45లక్షలతో నిర్మించనున్న పురాణ కాలక్షేప మండపానికి ఆదివారం ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ సాక్షిభావన్నారాయణస్వామి ఆలయ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా పాటుపడతామని తెలిపారు. ఆలయాన్ని సందర్శించి పూజారులు, సిబ్బంది, భక్తులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఆలయంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా పూజా కైంకర్యాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆలయంలో గతంలో ఉన్న పూజా విధానాలు విష్ణుసహస్ర పారాయణం వంటి కార్యక్రమాలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని, ఆలయంలో భూమి లభ్యత ఉన్నందున కల్యాణ మండప నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఆలయంలో శిథిల స్థితిలో ఉన్న బ్రహ్మసరోవరానికి మరమ్మతులు చేయాలని సూచించారు. వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో దేవదాయ శాఖ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. చారిత్రక నేపథ్యం ఉన్న భావన్నారాయణస్వామి ఆలయ పునర్వైభవానికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ నల్లకాలువ శ్రీనివాసురెడ్డి, దేవదాయశాఖ డీఈఈ శ్రీనివాసరావు, వీరాంజనేయస్వామి ఆలయ ఈవో గద్దె అమర్నాథ్, కూటమి పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీడిల్లీపోలక్ష్మమ్మకు ప్రత్యేక పూజలు

పొన్నూరు టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిడుబ్రోలు గ్రామదేవత శ్రీడిల్లీ పోలక్ష్మమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి మొక్కుబడులు సమర్పించే కార్యక్రమంలో భాగంగా లక్కీ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి మంత్ర జలాలతో జలాభిషేకాలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. నిడుబ్రోలు యువత ఆధ్వర్యంలో ప్రభల ఉత్సవం జరిగింది. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ హాజరై ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో నిడుబ్రోలు వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తూనికలు, కొలతల శాఖ అధికారుల దాడులు

కొల్లిపర, మే 4 (ఆంధ్రజ్యోతి): తూనికలు, కొలతలు శాఖ ఇన్‌స్పెక్టర్ శేషసాయి తన సిబ్బందితో కలిసి ఆదివారం మండలంలోని అత్తోట, తూములూరు, దావులూరు, కొల్లిపర తదితర గ్రామాల్లో చికెన్, మటన్, చేపలు విక్రయించే దుకాణాలపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 20మాంసం దుకాణాలలో తనిఖీచేసి తమ వెంట తెచ్చుకున్న తూనిక రాళ్లను ఎలక్ట్రానిక్ కాటాపై ఉంచి పరిశీలించారు. 7 మాంసపు దుకాణాలలో తక్కువ తూకం వచ్చేలా సెట్టింగ్ చేయించుకున్నట్లు నిర్ధారించారు. చేపలు, మటన్, చికెన్ విక్రయిస్తున్న ఏడుగురిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



తూములూరులో కాటాలను పరిశీలిస్తున్న తూనికలు కొలతలు శాఖ ఎస్ఐ శేషసాయి



దాసరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దిలీప్‌రాజా తదితరులు

దర్శకరత్న దాసరికి ఘన నివాళి

తెనాలి అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతి ఆదివారం మా ఏపీ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సినీ దర్శకుడు దిలీప్‌రాజా మాట్లాడుతూ, షూటింగ్ జరిగే సమయంలోనే డైలాగ్‌లు రాయగలిగిన సమర్థత సత్తా ఆయకే ఉండేదన్నారు. ఆయన తీసిన పలు సినిమాలు ఏడాదికి పైగా ప్రదర్శనకు నోచుకోవడం గొప్ప దర్శకత్వానికి నిదర్శనమన్నారు. 150కి పైగా సినిమాలకు దర్శకత్వం వహించి గిన్నిస్‌బుక్‌లో స్థానం సాధించారని, సినీరంగానికి ఆదర్శంగా నిలిచారని చెప్పారు. కార్యక్రమంలో ప్రసాద్, మస్తాన్, గురవయ్య, మణి తదితరులు పాల్గొన్నారు.



పాటల పోటీలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

వాసవీ ఆలయంలో అన్నమయ్య పాటల పోటీలు

తెనాలి అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): బోసురోడ్డులోని శ్రీవాసవీ ఆలయ ప్రాంగణంలోని గీతా మందిరంలో ఆదివారం అన్నమయ్య పాటల పోటీలు నిర్వహించారు. శ్రీవెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జూనియర్, సీనియర్ పోటీల్లో 100మంది బాల బాలికలు పాల్గొన్నారు. నాగార్జున యూనివర్శిటీ సంగీత విభాగం హెచ్‌వోడీ చింతలపాటి మంజుల న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. పోటీల్లో విజేతలను తిరుమల లేదా ద్వారకా తిరుమలకు ఉచితంగా యాత్ర చేయించి సంకీర్తన జరుపుతామని కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు తెలిపారు. వసుంధర, శారద, కనకదుర్గ, రమాదేవి, బాలచంద్రమౌళి, సావిత్రి పాల్గొన్నారు.